

వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల చైర్మన్ పదవుల రిజర్వేషన్‌పై కసరత్తు జరుగుతోంది. 50శాతం కమిటీల పగ్గాలను వివిధ వర్గాలకు కేటాయించాలన్న కూటమి ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జిలతో ఆమె మౌఖికంగా చర్చించినట్లు సమాచారం. మన జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇన్‌చార్జి మంత్రులను ప్రభుత్వం రంగంలోకి దించింది. దీంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవైపు దృష్టి సారించారు. టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జులకు ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు కిందిస్థాయి నాయకులతో చర్చలు ఆరంభించారు. ఏఎంసీ చైర్మన్ పోస్టుల విషయంలో రాజీపడేది లేదని వారు తేల్చిచెప్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ పదవుల రిజర్వేషన్ల ఖరారు విషయంలో ఎటూ తేలని పరిస్థితి నెలకొంది.



ఏఎంసీలపై కసరత్తు

- చైర్మన్ పదవుల్లో 50శాతం రిజర్వేషన్
- కూటమి ప్రభుత్వం నిర్ణయం
- కలెక్టర్‌కు బాధ్యత
- ప్రక్రియను ప్రారంభించిన అన్సారియా
- టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో చర్చలు
- ససేమిరా అంటున్న నేతలు
- రంగంలోకి ఇన్‌చార్జి మంత్రి ఆనం

టీడీపీ ప్రజాప్రతినిధులతో మాట్లాడిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

నామినేటెడ్ పోస్టుల భర్తీని ఇప్పటికే చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలోని అత్యధిక పదవులను పలువురికి కేటాయించింది. తాజాగా జిల్లా, నియోజకవర్గ, ఆకింది స్థాయి పోస్టులపై దృష్టి సారించింది. అందులో భాగంగా నియోజకవర్గస్థాయిలో కీలకమైన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలక మండళ్ల నియామకాన్ని జనవరిలో పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఆవైపు దృష్టి సారించింది. ఆ పదవుల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. పూర్వపు రోజుల్లో ఏఎంసీ చైర్మన్లకు సామాజికవర్గాల వారీ రిజర్వేషన్లు ఉండేవి కాదు. గత వైసీపీ ప్రభుత్వం ఈవిధానాన్ని అమలు చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం కూడా అదే పద్ధతిని కొనసాగించాలని నిర్ణయించింది. ఆ మేరకు జిల్లాల వారీ ఏఎంసీ చైర్మన్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు 50 శాతం కేటాయించింది. వాటిని ఖరారు చేసే అధికారం గతంలో కలెక్టర్లకు ఇచ్చారు. ఇప్పుడు కూడా అదేవిధంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆమేరకు కలెక్టర్లు ఆయా నియోజకవర్గాల్లో శాసనసభ్యులు, టీడీపీ ఇన్‌చార్జులతో మౌఖిక చర్చలు ప్రారంభించారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 15 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. విభజన అనంతర జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా గిద్దలూరు, మార్కాపురం సెగ్మెంట్ల పరిధిలో రెండేసి ఏఎంసీలు కలిసి కమిటీల సంఖ్య పదిగా ఉంది. దీంతో కలెక్టర్ అన్సారియా ఆయా మార్కెట్ కమిటీల రిజర్వేషన్లపై చర్చించారు. ఎక్కువ మంది టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జులు తమ నియోజకవర్గాల్లోని ఏఎంసీ చైర్మన్ పదవులను జనరల్ కేటగిరీలో ఉంచాలని కోరినట్లు తెలుస్తోంది. కలెక్టర్ చర్చలు ప్రారంభించగానే అసెంబ్లీ స్థానాలు దళితులకు రిజర్వు అయిన కొండపి, సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు తమ పరిధిలోని ఏఎంసీ చైర్మన్ పదవులను జనరల్ కేటగిరీకి రిజర్వు చేయాలని కోరినట్లు తెలిసింది. ఎమ్మెల్యే, ఇన్‌చార్జి రిజర్వు కేటగిరీలో ఉన్నందున అది సమంజసంగానే భావించారు. ప్రభుత్వం నుంచి వస్తున్న ఒత్తిడిని గుర్తించి మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఒక్కోచోట రెండేసి ఏఎంసీలు ఉన్నందున ఒకటి జనరల్ కేటగిరీలో ఉంచి మరొకటి రిజర్వు చేయాలని యోచించారు. అందుకు సదరు ఎమ్మెల్యేలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. మిగిలిన శాసనసభ్యులు ఎవరికి వారు తమ నియోజకవర్గాల్లోని ఏఎంసీ చైర్మన్ పదవిని జనరల్ కేటగిరీలో ఉంచాలని కోరినట్లు సమాచారం.

ఇన్‌చార్జి మంత్రి ఆనం సమాలోచన

ముఖ్యమంత్రి సూచించిన మేరకు చైర్మన్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే ఎమ్మెల్యేలు చేస్తున్న డిమాండ్లకు అనుగుణంగా సాధ్యం కాకపోవచ్చని కలెక్టర్ భావించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. దీంతో కలెక్టర్లు విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రులను ఆదేశించినట్లు తెలిసింది. తదనుగుణంగా మన జిల్లాకు ఇన్‌చార్జి అయిన రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి రంగంలోకి దిగారు. జిల్లాలోని టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జులకు ఆయన ఫోన్ చేసి రిజర్వేషన్‌ల విషయమై చర్చిస్తున్నారు. ఎక్కువ మంది శాసనసభ్యులు ఎన్నికల సందర్భంగా తాము హామీ ఇచ్చామని, తదనుగుణంగా రిజర్వేషన్ల విషయంలో మా అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిసింది. ఆ ప్రకారం రిజర్వేషన్లు చేపడితే 80 శాతం చైర్మన్ పదవులు జనరల్ కేటగిరీలో ఉంచాల్సి వస్తుంది. దీంతో ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి.. జిల్లా యూనిట్‌గా చైర్మన్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉన్నందున మీరు అందుకు అంగీకరించాల్సిందేనని సూచిస్తున్నట్లు సమాచారం.

సంకటస్థితిలో ఎమ్మెల్యేలు

ఇన్‌చార్జి మంత్రి ఒత్తిడితో ఎమ్మెల్యేలు సంకటస్థితిలో పడ్డారు. కిందిస్థాయి నాయకులతో చర్చలు ఆరంభించారు. అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలకు అనుగుణంగా కిందిస్థాయి నాయకులు ఏఎంసీ పదవుల విషయంలో రాజీపడేది లేదని తేల్చిచెప్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ పదవులు, రిజర్వేషన్ల ఖరారు విషయంలో అయోమయ పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యేల డిమాండ్లకు అనుగుణంగా ప్రభుత్వం రిజర్వేషన్ల విధానంలో వైఖరిని మార్చుకుంటుందా? తొలుత తీసుకున్న నిర్ణయం మేరకే ముందడుగు వేస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది.

స్థలం ఉంటే ఇల్లు మంజూరు

- యూనిట్ విలువ కూడా పెంపు
- పీఎంఏవై కింద దరఖాస్తుల స్వీకరణ
- మునిసిపాలిటీల్లో నెలాఖరు వరకే గడువు



ఒంగోలు నగరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద స్థలం సిద్ధంగా ఉండి గృహాన్ని నిర్మించుకునేందుకు ఆసక్తి చూపించే పేదలందరికీ వెంటనే మంజూరు చేయనుంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణను చేపట్టింది. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా యూనిట్ విలువను కూడా పెంచుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ఒక్కో పక్కాగృహ నిర్మాణానికి రూ.1.50లక్షలను మంజూరు చేసింది. నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో నిర్మాణాలు మా వల్ల కాదు బాబోయ్ అంటూ పేదలు గగ్గోలుపెట్టడంతో డ్వాక్రా సంఘాల మహిళల పేరుతో బ్యాంకుల్లో రూ.30వేల అప్పును ఇప్పించింది. అది కూడా అందరికీ మంజూరు కాలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన రూ.1.50లక్షలతో ఇంటి బేసుమట్టం మాత్రమే వేసుకుని నిర్మాణాలను నిలిపేసిన లబ్ధిదారులు జిల్లాలో అనేక మంది ఉన్నారు. దీంతో యూనిట్ విలువను పెంచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రప్రభుత్వం కొత్తగా మంజూరు చేయబోయే గృహాలకు యూనిట్ విలువ రూ.2.50లక్షలకు పైగానే ఉంటుందని గృహనిర్మాణశాఖ అధికారులు అంటున్నారు. ఆమేరకు ప్రభుత్వం నుంచి వారికి సమాచారం అందినట్లు తెలుస్తోంది. పక్కాగృహాల మంజూరు కోసం ప్రభుత్వం ఇప్పటికే సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణను చేపట్టింది. మునిసిపాలిటీల్లో ఈనెలాఖరు వరకూ గడువు ఇచ్చింది. జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్, ఆరు మునిసిపాలిటీలకు ప్రభుత్వం 1,700 పక్కా గృహాలను మంజూరు చేసింది. వీటిలో ఒంగోలుకు 850, మార్కాపురానికి 240, కనిగిరికి రూ.150, పొదిలికి 130, గిద్దలూరుకు 120, దర్శికి 110, చీమకుర్తికి 100 కేటాయించింది. ఇప్పటివరకు అన్ని మునిసిపాలిటీల్లోని సచివాలయాల ద్వారా 916 దరఖాస్తులు అందాయి. గ్రామీణప్రాంతాల నుంచి పక్కాగృహాల కోసం ఇప్పటివరకు ఆయా సచివాలయాల ద్వారా 7,709మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి సంఖ్య ఇంకా రెట్టింపు కానుంది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి మరో నెలరోజులు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. ఆ తర్వాత డిమాండ్ ప్రకారం ప్రభుత్వం గృహాలను మంజూరు చేయనుంది.

డివైడర్‌ను ఢీకొని ఆటోపై పడిన కారు

మహిళ మృతి... ఆరుగురికి గాయాలు



ఆటోని ఢీకొన్న అనంతరం బోల్తా కొట్టిన కారు

7

రేపే పింఛన్ల పంపిణీ

- నూతన సంవత్సరం సందర్భంగా ఒక రోజు ముందే ఇస్తున్న ప్రభుత్వం
- జిల్లాకు రూ.122.79 కోట్లు విడుదల
- నేడు బ్యాంకుల నుంచి డ్రా

ఒంగోలు నగరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా పింఛన్‌దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇక రోజు ముందుగానే పింఛన్ సొమ్ము ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పింఛన్‌ల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాలోని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పింఛన్‌దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఒకటో తేదీ ఆదివారం వస్తే రెండో తేదీన ఇచ్చేవారు. కొన్నిసార్లు ఐదో తేదీ వరకూ పింఛన్ సొమ్ము అందేది కాదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త సంప్రదాయాన్ని తీసుకువచ్చి పింఛన్‌దారుల కష్టాలను తొలగించింది. ఒకటో తేదీ ఆదివారం అయితే ఒకరోజు ముందే సొమ్ము ఇస్తోంది. ఇప్పటికే రెండుసార్లు అలా చేసింది. ప్రస్తుతం జనవరి 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్‌ను 31వతేదీనే అందించాలని నిర్ణయించింది.

జిల్లాలో 2,85,438 మంది లబ్ధిదారులు

జిల్లాలో 2,85,438 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. వీరికోసం ప్రభుత్వం రూ.122.79 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులను 30వ తేదీన అంటే సోమవారమే సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేయనున్నారు. 31వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు ముందే పంపిణీని ప్రారంభించనున్నారు. జిల్లాలో గత రెండు నెలల నుంచి పింఛన్ తీసుకోని వారికి మూడు నెలలకు కలిపి ఒకేసారి ఇవ్వనున్నారు.

పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు...

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పింఛన్ తీసుకునే వ్యక్తి చనిపోతే ఆ మరుసటి నెల నుంచే భార్యకు మంజూరు చేసే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. నవంబరు ఒకటి నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు జిల్లాలో 237 మంది మృతి చెందారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల నుంచి వారి భార్యలకు పింఛన్ సొమ్ము ఇవ్వనున్నారు. గతంలో పింఛన్‌దారుడు చనిపోతే ఆ కుటుంబంలో ఇంకొకరికి రావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఇప్పుడు మరుసటి నెలలోనే ఇచ్చి కూటమి ప్రభుత్వం ఆదుకొంటోంది.



నేటి నుంచి కానిస్టేబుల్ పోస్టులకు ఎంపిక

ఒంగోలులో ఏర్పాట్లు పూర్తి

7





క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

డ్రైవర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆవిష్కరించారు. ఆదివారం ఒంగోలులోని ఎమ్మెల్యే దామచర్ల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వాహనాల డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తీసుకెళ్ళారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సతీష్‌బాబు, పోలురాజు, బాష, రమణబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

● జేవీవీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జేవీవీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా కోశాధికారి బి.తిరుపతయ్య అధ్యక్షతన జేవీవీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఏవీ.పుల్లారావు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు సమాఖ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టు అని, సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు యు.భాస్కర్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ళుగా ప్రతి రెడు నెలలకు ఒకసారి జరిగే దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపు జనవరి 5 ఒంగోలులో జరుగుతుందని తెలిపారు. జిల్లా బాలోత్సవం కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వీరాంజనేయులు, జేవీవీ గౌరవ సలహాదారులు కె.సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ ఒంగోలులో ఫిబ్రవరి 7,8తేదీల్లో ప్రకాశం బాలోత్సవం పిల్లల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరాన్ని యువత మద్యంతో కాకుండా కుటుంబాలు, సన్నిహితులు, స్నేహితులతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.జయప్రకాష్, జడ్.రమణయ్య, యు.వెంకట్రావు, బాలునాయక్, శ్రీనివాసరెడ్డి, రామన్, జి.హరిబాబు, టీవీ.సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు, మాలిక్, సీహెచ్.లక్ష్మీనారాయణ, జి.ఉమామహేశ్వరి, జగదీశ్వరి, దార్ల శ్రీను, ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు ఆదివారం రాత్రి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి వార్షిక కళ్యాణోత్సవంలో వారు పాల్గొనగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోలీసులకు డ్రోన్ కెమెరా అందజేత



రమణారెడ్డిని సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం అధునాతన సాంకేతిక వినియోగించేందుకు ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవీ.రమణారెడ్డి డ్రోన్ కెమెరాను ఆదివారం ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. తాలుకా పోలీస్‌స్టేషన్‌లో వినియోగానికి అవసరమైన డ్రోన్ కెమెరా అందజేసిన రమణారెడ్డిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల యూనియన్ కార్యవర్గం



కార్యకవర్గ సభ్యులు

టంగుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మండల ఫొటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షునిగా రమేష్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఫొటోగ్రాఫర్ల సమావేశం ఆదివారం టంగుటూరులో జరిగింది. ఈ సమావేశంలో మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా రమేష్‌బాబు, గౌరవ అధ్యక్షునిగా కె. మదన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా హరిబాబు, పి.దేవదాసులను ఎన్నుకున్నారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు

పెద్దదోర్నాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేగం అదుపు తప్పిన ఓ కారు లోయలోనికి దూసుకెళ్లిన ఘటన శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో చింతల సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన ఓ కుటుంబం కారులో దైవదర్శనం కోసం శ్రీశైలం వెళుతుండగా చింతల సమీపంలో రోడ్డులో గుంత ఉండడంతో పక్కకు తప్పించే క్రమంలో రక్షణ గోడను ఢీకొంది. అనంతరం అదుపు తప్పి పక్కన లోయలోకి దూసుకుపోయింది. అయితే అక్కడ లోతు తక్కువగా ఉండడం, చిల్ల చెట్లు అధికంగా ఉండడంతో వాహనం ముందుకు వెళ్లలేక ఆగిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో వాహనంలో ప్రయాణించే వారు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని బయటకు తీయించారు.

నేడు పోలీస్‌స్టేషన్‌లోని బైకుల వేలం

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన రెండు బైకులను ఈ నెల 30వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట వేయనున్నట్లు ఎస్ఐ పి.చౌడయ్య ఆదివారం తెలిపారు. 2023 సంవత్సరంలో పలు కేసుల్లో సీజ్ చేసిన ఫ్యాషన్ ప్రో రూ.5600, ఫైన్ రూ.7వేలు చెప్పున వేలం పాట వేయనున్నట్లు తెలిపారు. 29న జరగాల్సిన ఈ వేలం పాట అనివార్య కారణాల వల్ల సోమవారం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కావున ప్రజలు ఈ బైక్‌ల వేలం పాటలో పాల్గొనాలని ఎస్ఐ కోరారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం

● ద్విచక్రవాహనదారులకు ఎస్ఐ అజయ్‌బాబు సూచన

● మండలంలో అవగాహన కార్యక్రమాలు

● మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్లు ధరించక 18 మృతి



హెల్మెట్లు ధరించాలంటూ అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది

సంతనూతలపాడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): "తలకు హెల్మెట్ ధరించండి. సురక్షిత ప్రయాణం చేయండి. మీ జీవితమే కాకుండా మీపై ఆధారపడిన కుటుంబసభ్యుల జీవితాలు కూడా ఉన్నాయి. అందువల్ల కొంచెం ఆలోచించి వాహనం నడిపేటప్పుడు తప్పకు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి." అంటూ ఎస్ఐ వి.అజయ్ బాబు పిలుపునిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్విచక్రవాహనదారుల విషయంలో వారి బాగుకోసం హెల్మెట్ ధరించాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. క్రమంలో ఎస్పీ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో ఎస్ఐ వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో పలు మార్లు మండలంలో హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడపాలంటూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రచారాలతో వాహనదారుల్లో మార్పుతెచ్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. మండలంలో గత మూడేళ్లలో రోడ్డు ప్రమాదాల్లో 18మంది మృత్యువాత పడ్డారు. అధికంగా యువకులే ఉండటంతో ఆ కుటుంబాల్లో శోకం మిగులుతోంది.

హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలు

● ద్విచక్రవాహనం నడిపే వాళ్ల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. ప్రమాదం జరిగినపుడు అది ఊడి కిందపడిపోకుండా బెల్ట్ పెట్టుకోవాలి. రహదారి భద్రతాప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్లు వినియోగించాలి.

● వాహనం వెళ్తున్నపుడు దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే, తలకు తీవ్రగాయం కాకుండా హెల్మెట్ కాపాడుతుంది. మెదడు దెబ్బతిని ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నుంచి తప్పించుకోవచ్చు. హెల్మెట్ ధరించడం వలన బతికే అవకాశాలు 45శాతం ఎక్కువ. గాయాల నుంచి రక్షణ 55 శాతం లభిస్తుంది.

● శబ్దం నేరుగా చెవులను తాకదు. గాలివేగం, దుమ్ము ధూళి కళ్లకు, మొఖానికి ఇబ్బంది కలిగించదు. ఎండవానల నుంచి రక్షణ ఇస్తుంది. వేసవి కాలం, సీతాకాలంలో మొఖానికి ఇబ్బందుల్లేకుండా కాపాడుతోంది. అధిక బీమ్ లైట్ల నుంచి కాపాడుతుంది.

● రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరంగా తీసుకునే చర్యలకు బాధ్యులవుతారు.

● తల, మెదడు, ముక్కు, చెవులకు ఎటువంటి గాయాలు కాకుండా హెల్మెట్ కాపాడుతుంది. రాళ్లు, కీటకాలు, దుమ్ము, ధూళి తగలకుండా రక్షణ ఇస్తుంది.

మండలంలో నమోదైన కేసులు

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	13	1	15
2023	17	9	11
2024	20	8	14

(డిసెంబరు 28 వరకు గల వివరాలు)

ఆర్యవైశ్యులకు అన్ని వేళలా అండగా ఉంటా

● ఎమ్మెల్యే దామచర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల కోసం అన్ని వేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక దామచర్ల నివాసంలో ఆర్యవైశ్యులతో సమావేశం అయిన ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించారని కృతజ్ఞతలు చెప్పారు. అలాగే ఆర్యవైశ్యులను గెలిచిన తర్వాత ప్రత్యేకంగా కలవలేకపోయానని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తానని పేర్కొన్నారు. అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, తననను ఎప్పుడైనా నేరుగా కలవచ్చని కోరారు. నగర అభివృద్ధిలో భాగంగా కొన్ని వ్యాపార సముదాయాలు ఉన్న రోడ్డు మార్గాలు చిన్నవిగా ఉన్నాయన్నారు. వాటిని విస్తరించే క్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. సమావేశంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

సొసైటీల ఎన్నికలపై సమీక్ష

ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ ఎన్నిల ప్రక్రియపై నామినేటెడ్ కమిటీల ఎంపిక త్వరితగతిన చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. పీఏసీఎస్ ఎన్నికలపై దామచర్ల ఆదివారం ఒంగోలులోని తన నివాసంలో కరవది, సర్వేరెడ్డిపాలెం, లింగంగుంట, కొత్తపట్నం సొసైటీ పరిధిలోని నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీలకు జరగబోయే నామినేటెడ్ కమిటీలకు సంబంధించి ఎంపిక ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

మాలల ధర్మయుద్ధానికి ఎమ్మెల్యేలు సహకరించాలి

● మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు వెంకట్రావు



ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వెంకట్రావు, నాయకులు

చీమకుర్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మాలజాతికి జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవటానికి మాలలు నిర్వహిస్తున్న ధర్మయుద్ధానికి ఎమ్మెల్యేలు అందరూ సహకరించాలని మాలమహసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు కోరారు. ఆదివారం చీమకుర్తి పట్టణం అంబేద్కర్‌నగర్‌లో బి.డేవిడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్సీల సోషల్ ఆడిట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి23న గుంటూరులో నిర్వహించబోతున్న మాలల ధర్మయుద్ధం మహసభను విజయవంతం చేయాలని కోరారు. రాజీవ్ రంజన్‌మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిశారు. మాలలు చేస్తున్న ధర్మయుద్ధానికి మద్దతు పలకాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, వేమా శ్రీనివాసరావు, పీవీ.రావు, దారా అంజయ్య, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులైన వీఆర్వోలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

● జిల్లా అధ్యక్షుడు రంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రంగయ్య

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో)లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించే విధంగా రాష్ట్ర సంఘం ప్రత్యేక చొరవ తీసుకోవాలని వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వైసీ.రంగయ్య కోరారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన జిల్లాకు సంబంధించిన పలు రకాల సమస్యలను విన్నవించారు. బయోమెట్రిక్ విధానం వల్ల వీఆర్వోలు గ్రామాల్లో నెట్‌వర్క్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్ల ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేవిధంగా ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర సంఘం తీసుకెళ్ళాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను భర్తీతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న వీఆర్వోలే ఖాళీగా ఉన్న గ్రామాలను కూడా చూడాల్సిరావడంతో పనిభారంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్ళ నుంచి బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గౌరవవేతనం అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య, రాష్ట్రకార్యవర్గసభ్యులు రవికుమార్, బెంజిమెన్, నల్లమేకల నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌రంగాన్ని నిర్వీర్యం చేసి.. నేడు ధర్నాలా

● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధ్వజం

మార్కాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ విద్యుత్ రంగంలో విధ్వంసం సృష్టించి నిర్వీర్యం చేసిన నాటి పాలకుల పాపమే నేడు విద్యుత్ చార్జీల భారానికి కారణమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రోడ్లెక్కి ధర్నాలు చేయడానికి అసలు వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. విద్యుత్‌రంగాన్ని మాజీ సీఎం జగన్ సర్వనాశనం చేశారన్నారు. అన్ని రకాలుగా లూటీ చేసి రూ.1.29లక్షల కోట్లకుపైగా అప్పుల భారాన్ని విద్యుత్ శాఖపై మోపారన్నారు. జగన్ అవినీతి కారణంగానే రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడిందన్నారు. 2014లో లోటు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019 నాటికి మిగులు విద్యుత్ సాధించారన్నారు. అనంతరం గద్దెనెక్కి వైసీపీ చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేసిందన్నారు. దీంతో రూ.5లకు వచ్చే యూనిట్ విద్యుత్‌ను రూ.7కు పెంచి కొనుగోలు చేసి, నాటి వైసీపీ నాయకులు కమీషన్లు దండుకున్నారన్నారు. దీంతో ఆ భారం ప్రజలపై పడిందన్నారు. అప్పట్లో తక్కువ ధరకు లభించే సోలార్ విద్యుత్ విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. 10 వేల మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోయింద న్నారు. విద్యుత్ సంస్థలపై రూ.49 వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. నిర్మాణం పూర్తయిన ప్పటికీ కృష్ణపట్నం వీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదన్నారు. సెకీ ఒప్పందం విషయంలో అమెరికా కోర్టులో జగన్‌పై కేసు నమోదైనా వైసీపీ నాయకులకు సిగ్గు రావడం లేదన్నారు. అంతేకాక ట్రూఅప్ చార్జీలను గత వైసీపీ పాలనలోనే పెంచారన్నారు. 2023 డిసెంబరులో కూడా ట్రూఅప్ చార్జీలను వసూలు చేయాలని ఆదేశించింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నాడు విద్యుత్‌రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్ నేడు ధర్నాకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కందుల మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు పఠాన్‌ఇబ్రహీం, మాలపాటి వెంకటరెడ్డి, కనిగిరి బాలవెంకటరమణ, గులాబ్‌బాష, మయారి ఖాశిం, పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కొత్తపట్నం పోలీస్‌స్టేషన్ తనిఖీ

కొత్తపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం డీఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతిబద్రతల పరిరక్షణలో రాజీపడకుండా పనిచేయాలని పోలీసులకు సూచించారు. స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలను కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఒంగోలు టూటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం వెల్లంపల్లి వద్ద చోటుచేసుకుంది. కలకత్తాకు చెందిన కార్మికుడు తన మిత్రులతో కలిసి ద్విచక్రవాహనం మీద గ్రోత్ సెంటర్ నుంచి ఒంగోలు వెళ్తున్నారు. అయితే వెల్లంపల్లి వద్దకు రాగానే కాలినడకన రోడ్డును దాటుతున్న దొడ్డవరం గ్రామానికి చెందిన పి.శంకర్‌ను ఢీకొన్నారు. దీంతో ద్విచక్రవాహనం మీద ఉన్న ఇద్దరికీ, శంకర్‌కు గాయాలయ్యాయి. అనంతరం క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

మద్దిపాడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5వ తేదీన వివిధ హైందవ సంఘాల ఆధ్వర్యంలో జరుగనున్నన హైందవ శంఖారావం సభకు మండల పరిధిలోని హిందూ సంఘాల ప్రతినిధులు, హిందువులు భారీగా తరలిరావాలని హైందవ శక్తి మండల కన్వీనర్ నట్టి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం మద్దిపాడు నుంచి బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ముందుగా 9441036834, 9912870840, 9701469445 సెల్ నెంబర్లలో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని ఆయన కోరారు.

రౌడీషీటర్‌పై అట్రాసిటీ కేసు

నాగులుప్పలపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిని కులం పేరుతో దూషించిన రౌడీషీటర్ పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు, మండలంలోని తిమ్మసముద్రం గ్రామం అంబేద్కర్‌కాలనీకి చెందిన గోపతోటి నాగరాజువర్మకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన రౌడీషీటర్ నల్లూరి రాజాకు గతంలో పరిచయం ఉంది. ఇద్దరి మధ్య నగదు విషయంలో వివాదం వచ్చింది. ఈ నెల 28న తెల్లవారుజామున ఉప్పుగుండూరు గ్రామంలో ఉన్న సుబ్బయ్య హోటల్ వద్దకు నాగరాజువర్మ వచ్చాడు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న నల్లూరి రాజాను ఆయన డబ్బులు అడిగారు. దీంతో నాగరాజువర్మను కులం పేరుతో దూషించి తన దగ్గర ఉన్న చాకుతో దాడి చేశాడు. దీంతో గాయపడ్డ నాగరాజువర్మ చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. అక్కడి ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ రాజాపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

సింగరాయకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత సింగరాయకొండ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎస్సై బి.మహేంద్ర తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,910 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడి పందాలు శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ సుబ్బారావు

ఒంగోలు విద్య, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్జేడీ వీవీ.సుబ్బారావు ఆవిష్కరించారు. స్థానిక పీవీఆర్ స్కూలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఆయన క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తారకనాథ్, అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎల్‌పీ వార్షికోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండిపెండెంట్ లేబర్ పార్టీ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం ఆధ్వర్యంలో స్థానిక మంగమూరురోడ్డులో ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీనగర్‌లోని మూడు బొమ్మల సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నాయకులు కట్ట వరప్రసాద్, తోమాటి వెంకటేశ్వర్లు, ఆర్. వెంకటేశ్వర్లు, అచ్చయ్య, జార్జి, సుబ్బారావు, దాసరి సంగీతరావు, కె.లీలావతి, కటికల కార్తీర్, రవికుమార్, దాసరి కోటమ్మ, రమేష్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఒంగోలుకు గుర్తింపు



నాగేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న యోగయ్యయాదవ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : భారతీయ జనతా పార్టీ సాధారణ సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ తెలిపారు. స్థానిక సమతానగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఒంగోలు పరిధిలో లక్ష మందితో సభ్యత్వం పూర్తి చేసి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం లభించిందని, ఇందుకు పాటుపడిన నాయకులను అభినందించారు. అనంతరం మండల అధ్యక్ష నియామకాన్ని నిర్వహించారు. ఒంగోలు మండల అధ్యక్షుడుగా ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ ధనిశెట్టి రామానాయుడు, నాయకులు తీగల సత్యవతి, డి.విజయరావు, నర్ల రాజశేఖర్, కిలారి రవికుమార్, కాటా రాధాకృష్ణమూర్తి, తిరుమలశెట్టి శ్రీరాములు, సింగోతి రాజేష్‌వర్మ, సంజీవ్‌కుమార్, సత్యరంగయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించాలి



గ్రామ సచివాలయం ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

టంగుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రిజర్వేషన్ల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సోషల్ ఆడిట్ సక్రమంగా నమోదు కావడం లేదని, సచివాలయ ఉద్యోగు లు జాగ్రత్తగా నమోదు చేయాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు ఆరోపించారు. మాల ఉద్యోగ సంఘ నాయకులు, మాల నాయకులు టంగుటూరులోని సచివాలయం-2 వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. సోషల్ ఆడిట్ వివరాలన్నీ నోటీస్ బోర్డులో పెట్టాలని కోరారు.

గృహంలోకి దూసుకెళ్లిన కారు

కొమరోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పిన కారు ఓ గృహంలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని దద్దవాడ గ్రామంలో ఆదివారం జరిగింది. కడప జిల్లా రాజంపేట నుంచి భద్రాచలం దైవదర్శనానికి కారు వెళుతుంది. కొమరోలు మండలంలోని గిద్దలూరు-అమరావతి హైవేలోని దద్దవాడ గ్రామంలో ఒక వైపు నుంచి ఆటో, మరోవైపు మోటార్‌సైకిల్ ఎదురుగా వచ్చాయి. వీటిని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న గృహంలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు పూర్తిగా దెబ్బతింది. కారులోని కుటుంబసభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మూడు వాహనాల్లో ప్రయాణికులకు స్వగా గాయాలు కాగా వారిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

వైద్యుల 'ఆట' విడుపు

- న్యూ ఇయర్ సందర్భంగా క్రీడా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న డాక్టర్ల కుటుంబాలు


క్యారమ్స్ ఆడుతున్న డాక్టర్లు




హైదరీ క్లబ్‌లో న్యూఇయర్ సందర్భంగా డాక్టర్లకు ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయశేఖర్

నిరంతరం వైద్య సేవలు.. మందులు.. ఆపరేషన్లు.. రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఉరుకులు పరుగులు.. ఇదీ నేడు డాక్టర్ల జీవన శైలి. కనీసం కుటుంబ సభ్యులతో కలిసి కాసేపు సరదాగా గడిపే సమయమే ఉండదు. అయితే ఏటా నూతన సంవత్సరం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ల ఫ్యామిలీలకు మూడు రోజులపాటు క్రీడాపోటీలు నిర్వహించడం.. సరదాగా గడపటం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆదివారం స్థానిక హైదరీక్లబ్‌లో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి జయశేఖర్ పలు క్రీడాపోటీలను ప్రారంభించారు. మొదటి రోజు షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. డాక్టర్లు వారి కుటుంబ సభ్యులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోజంతా పోటీల్లో పాల్గొని సందడి చేశారు. అలాగే టెన్నిస్, చెస్, టేబుల్ టెన్నిస్, ఇతర పోటీల్లో డాక్టర్ల కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ పోటీల పర్యవేక్షకులుగా ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ జాలాది మణి బాబు వ్యవహరించారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)


ట్రయల్స్‌లో అభ్యర్థి కొలతలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

నేటి నుంచి పోలీసు కానిస్టేబుళ్ల ఎంపిక

- దేహదారుఢ్య పరీక్షకు 5,345 మంది
- వచ్చే నెల 10 వరకు ప్రక్రియ
- ట్రయల్స్ నిర్వహించిన పోలీసులు

ఒంగోలు(క్రైం)డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా కానిస్టేబుళ్ల ఎంపిక లేదు. కేవలం రాత పరీక్ష మాత్రమే నిర్వహించి నిరుద్యోగులు నీరసపడే విధంగా చేశారు. అప్పటి నుంచి ఆశలు పెంచుకున్న అభ్యర్థులకు కానిస్టేబుళ్ల ఎంపిక ఊరటగా మారింది. గత ఐదేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురు చూసిన యువతీయువకులలో ఆశలు చిగురించాయి. న్యాయ పరమైన చిక్కులను పరిష్కరించి కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తున్నారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 10 వరకు ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలకు 5,345 మంది హాజరు అవుతున్నారు. ఈమేరకు ఆదివారం ఉదయం ఎస్పీ ఏఆర్ దామోదర్ నేతృత్వంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఎంపిక ప్రక్రియలో 4,435 మంది పురుషులు, 910 మంది మహిళలు పాల్గొంటున్నారు. తొలుత సర్టిఫికెట్ల పరిశీలన, దేహదారుఢ్య పరీక్షల అనంతరం 1600 మీటర్లు ,100 మీటర్ల పరుగుతోపాటుగా లాంగ్‌జంప్ తదితర ఈవెంట్‌లు ఉంటాయి. ట్రయల్‌రన్‌ను పరిశీలించిన ఎస్పీ మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మవద్దని నిరుద్యోగ యువతకు హితవు పలికారు. కానిస్టేబుళ్ల ఎంపిక పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో జరుగుతుందన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి మాయమాటలు నమ్మి మోస పోవద్దని అన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్ బాబు, సిబ్బంది ఉన్నారు.

పెట్రోల్ సబ్సిడీ కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

- అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన

ఒంగోలు నగరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెట్రోల్ సబ్సిడీని పొందేందుకు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జనవరి 10వ తేదీలోగా తమ దరఖాస్తులను స్థానిక ప్రకాశంభవనంలోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. మూడు చక్రాల వాహనం కలిగి ఉండి స్వయం ఉపాధి కాని, ప్రయివేట్ సంస్థలో పనిచేస్తూ వాహనం వాడే దివ్యాంగులకు ఈ సబ్సిడీ విడుదల చేస్తామన్నారు. వివరాలకు 08592-281310 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు పోలీసు 'మీకోసం' రద్దు : ఎస్పీ

ఒంగోలు(క్రైం), డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదివారం తెలిపారు. పోలీసు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ జరుగుతున్నందున ఈ కార్యక్రమాని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అందువల్ల ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు హాల్‌టిక్కెట్లు సిద్ధం

ఒంగోలు విద్య, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం ఒంగోలులో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఈనెల 5 నుంచి 14వతేదీ వరకు హాల్ టిక్కెట్లు తీసుకోవాలని ప్రిన్సిపాల్ వీకే.గీతలక్ష్మి ఆది వారం ఒక ప్రకటనలో కోరారు. నవోదయ ప్రవేశపరీక్ష వచ్చేనెల 18వతేదీన జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను సంబంధిత మండల విద్యాధికార్యాలయాల్లో పొందాలన్నారు. ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు రశీదులతో హాల్ టిక్కెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం 9951091988, 9346824862, 9247577102 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

నాగులుప్పలపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. శనివారం తెల్లవారుజామున చీరాల వైపు నుంచి 320 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ లారీని మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ సమీపంలో విజిలెన్స్ సీఐ రాఘవరావు పట్టుకున్నారు. బియ్యం బస్తాలను ఎఫ్‌సీఐ గోడౌనుకు తరలించి లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సదరు లారీతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు.

ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి ● ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు డిమాండ్


మాట్లాడుతున్న శరత్‌బాబు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో తొలగించిన మగ ఆరోగ్య కార్యకర్తలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరారు. వివిధ సంఘాల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఉద్యోగులు చేసే ఐక్య పోరాటాలకు ఏపీఎన్‌జీవో సంఘం అండగా ఉంటుందని చెప్పారు. ఏపీ హెల్త్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు టి.రమణారెడ్డి మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుంచి వైద్య ఆరోగ్యసేవలు అందిస్తున్న ఉద్యోగులను తొలగించడం తగదన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ అంకితభావంతో పని చేస్తున్న మగ ఆరోగ్యకార్యకర్తలను ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ వయస్సులో ఉన్నంత కాలం కాంట్రాక్టు కార్మికుల చేత సేవలు చేయించుకొని వయస్సు మళ్లిన తర్వాత వారిని తొలగించడం తగదన్నారు. వెంటనే తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీధర్‌బాబు, కె.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, టి.రవి, జి.శ్రీనివాసులు, మసూద్‌అలి, ఇ.అన్నపూర్ణ, భాస్కర్, ఇ.మల్లికార్జునరావు, చిరంజీవి, టి.తిరుపతిరావు, కె.మాలకొండయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి పోరుదీక్షను విజయవంతం చేయాలి


అభివాదం చేస్తున్న నాయకులు

- విద్యార్థి సంఘాల పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం విజయవాడలో జరిగే పోరుదీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజి యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్, వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డిలు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినెలలు గడుస్తున్నా విద్యాదీవెన, వసతిదీవెనల పేర్లు మార్చింది తప్ప ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.3,580 కోట్లు ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఫీజులు చెల్లించాలని కాలేజీల యాజమాన్యాల వత్తిడితో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. పోరుదీక్షకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో వసతి గృహాలకు మహర్దశ

- హాస్టళ్ల మరమ్మతులకు రూ.143 కోట్లు
- కొత్తవి నిర్మాణానికి రూ. 206 కోట్లు
- సింగరాయకొండలో మంత్రి స్వామి వెల్లడి

సింగరాయకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వసతి గృహాల రూపురేఖలను పూర్తిగా మారుస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చెప్పారు. అందుకు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ హాస్టళ్ల మరమ్మతులకు రూ.143 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఆదివారం సింగరాయకొండలోని కళాశాల బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను, ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో చేపట్టాల్సిన మరమ్మతులపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉండే ఎస్సీ, బీసీ హాస్టళ్లను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. దీంతో విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వంలో రూ.206 కోట్లతో 62 నూతన హాస్టళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. భీమ్ ప్రాజెక్ట్‌తో గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని వివరించారు. గురుకులాల్లో 15 రకాల పరికరాలతో హెల్త్‌కిట్‌లను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. స్థానిక కళాశాల బీసీ బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.10.50 లక్షలు, బాలికల హాస్టల్‌కు రూ.10.70 లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.10 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. అద్దె భవనంలో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను ఎస్సీ బాలుర హాస్టల్‌లో కలపడానికి, కళాశాల బీసీ హాస్టల్‌ను ఇంటిగ్రేటేడ్ వసతి గృహంగా మార్పు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ జగన్‌మోహన్‌రావు, మండల టీడీపీ అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులు, కూనపరెడ్డి సుబ్బారావు, షేక్ సంధానీబాషా, సుదర్శి చంటి, గాలి హరిబాబు, పులి ప్రసాద్, గుదే వెంకటేశ్వర్లు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, యస్థాని ఉన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

కబళించిన మృత్యువు

- డివైడర్‌ను ఢీకొని ఆటోపై పడిన కారు
- మహిళ మృతి, ఆరుగురికి గాయాలు
- పెళ్లూరు ఫ్లైవోవర్‌పై ఘటన




కారు కింద నలిగిపోయి మృతిచెందిన మహిళ లక్కే పద్మ (ఇన్‌సెట్లో) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఒంగోలు(క్రైం),డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మృత్యురూపంలో వచ్చిన కారు ఓ మహిళ జీవితాన్ని కబళించింది. బొంతలు కుట్టుకుంటూ జీవనం సాగించే ఆ కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది. అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి ముందు ఉన్న ఆటోపై పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం జాతీయ రహదారిపై పెళ్లూరు ఫ్లైవోవర్‌పై జరిగింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల జరిగిన ఈ ప్రమాదంలో టంగుటూరు మండలం వెంకటాయిపాలెంనకు చెందిన లక్కే పద్మ(47) మృతిచెందగా, ఆమె కుమార్తెలు కుందేటి లక్ష్మి, గజ్జి మాధవి, టంగుటూరుకు చెందిన రమేష్, విజయమ్మ, బాలకోటేశ్వరరావు, సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మునివరలకు గాయాలు అయ్యాయి. మృతి చెందిన పద్మ ఆమె కుమార్తెలు బొంతలు కుట్టుకొని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. అనుకోని ప్రమాదంలో పద్మ మృతి చెందడంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది.

ప్రమాదం జరిగింది ఇలా...

టంగుటూరు నుంచి ఏపీ 39టీఏ6039 నంబరు గల ఆటో ఒంగోలు వైపు వెళుతోంది. నెల్లూరు వైపు నుంచి విజయవాడకు వెళుతున్న ఏపీ 39ఎల్‌యూ 9949 నంబరు గల కారు అతివేగం వచ్చి జాతీయ రహదారిపై పెళ్లూరు ఫ్లైవోవర్ బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొంది. ఆ వేగానికి గాలిలోకి లేచి ఎదురుగా ఉన్న ఆటోపై పడింది. దీంతో ఆటో బోల్తా పడి ప్రయాణికులు అంత కింద పడిపోయారు. లక్కే పద్మపై కారు పడింది. దీంతో అమె అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన మాధవి,లక్ష్మి, రమేష్ ,విజయమ్మ, బాలకోటేశ్వరరావు , మునివరలను 108లో రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు తాలుకా ఎస్సై ఫిరోజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ

ఏపీ రెవెన్యూ అసోసియేషన్ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మార్కాపురం డివిజన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.కిరణ్, అసోసియేట్ అధ్యక్షులుగా జే.జితేంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్‌వీ. సుబ్బారావు, ఎ.నాయబ్‌హుస్సేన్, షేక్ పర్వీన్, కార్యదర్శిగా షేక్ ఇబ్రహీం ఖలీల్, సహాయ కార్యదర్శులు టీవీఎస్ ప్రసాద్, పి.రామకృష్ణ, షేక్ జానీబాషా, కోశాధికారిగా ఎస్.చంద్రశేఖర్ రావు, ఈసీ సభ్యులుగా జి.భారతిబాయ్, ఆర్.సాలమ్మలు ఎన్నికయ్యారు.

నేడు కొమరోలు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరుకానున్నారు. కావున ప్రతిశాఖకు సంబంధించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. అదేవిధంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై కూడా ప్రతి అధికారి పూర్తిసమాచారంతో రావాలని తెలిపారు.

పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు



పరిశ్రమను సందర్శించిన చెన్నారెడ్డిపల్లె విద్యార్థులు

తర్లుపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నారెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో పరిశ్రమల యాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా కడప జిల్లా బద్వేల్ సమీపంలో ప్లే వుడ్ సెంచూరియన్ కంపెనీని సందర్శించారు. కంపెనీ సిబ్బంది ప్లే వుడ్ ఎలా తయారయ్యేది క్షుణ్ణంగా వివరించారు. పరిశ్రమల సందర్శన వలన విద్యార్థులు తెలుసుకోవాల్సిన విషయాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఓవీ రవిశేఖర్‌రెడ్డి, ఓ.నరసింహారావు, బీఐఎస్ సంస్థ సభ్యులు కిషోర్ తదితరులు వెళ్లి పరిశ్రమలను పరిశీలించారు.

జిల్లా స్థాయిలో ఖురాన్ కంఠస్థ పోటీలు



ఖురాన్ కంఠస్థ పోటీల్లో పాల్గొన్న బాలికలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నమసీదు ఆవరణలో జిల్లా స్థాయి ఖురాన్ కంఠస్థ పోటీలు క్వార్టర్ ఫైనల్స్ స్థాయిలో ఆదివారం నిర్వహించారు. యూనైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్, జమాతే ఇస్లామీ హింద్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కంఠస్థ పోటీల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటి బహుమతులు మహ్మద్, షాకీబ్ షాయిదా, నసీఫా, ఫాతిమా, రుక్సాలు సాధించారు. ఈ సందర్భంగా ఏ1 గ్లోబల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం.షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ.. విద్యార్థులలో చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక విలువలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లాం హింద్ రాష్ట్ర సభ్యులు అష్రఫ్ అలీ, జేఐహెచ్ నాయకులు సికిందర్ బాషా, ఎస్ఐఓ అధ్యక్షులు అరాఫత్, ఐవైఎం రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, తలహా, రసూల్ పాల్గొని ప్రసంగించారు. న్యాయ నిర్ణేతలుగా హాఫీజ్ పఠాన్ అయూబ్ ఖాన్, అబ్దుల్ రెహమాన్, షేక్ మహ్మద్‌లు వ్యవహరించారు.

నేడు పోలీస్ స్టేషన్‌లోని బైకుల వేలం

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన రెండు బైకులను ఈ నెల 30వ తేదిన తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట వేయనున్నట్లు ఎస్సై పి. చౌడయ్య ఆదివారం తెలిపారు. 2023 సంవత్సరంలో పలు కేసులలో సీజ్ చేసిన ప్యాషన్ ప్రో రూ.5600, షైన్ రూ.7వేలు చెప్పున వేలం పాట వేయనున్నట్లు తెలిపారు. 29న జరగాల్సిన ఈ వేలం పాట అనివార్య కారణాల వలన సోమవారం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు కావున మండల ప్రజలు ఈ బైక్‌ల వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

గృహంలోకి దూసుకెళ్లిన కారు

- ఆటోను తప్పించే క్రమంలో ఘటన



ఇంటిగోడలోకి దూసుకెళ్లిన కారు

కొమరోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి కారు ఓ గృహంలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని దద్దవాడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు కడప జిల్లా రాజంపేట నుంచి భద్రాచలం దైవదర్శనానికి కారు వెళుతోంది. కొమరోలు మండలంలోని గిద్దలూరు-అమరావతి జాతీయ రహదారిలోని దద్దవాడ గ్రామంలో ఒక వైపు నుంచి ఆటో, మరో వైపు మోటర్ సైకిల్ ఎదురుగా వచ్చాయి. వీటిని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న గృహంలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. కారులోని కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మూడు వాహనాల్లో ప్రయాణికులకు చిన్న చిన్న గాయాలు అయ్యాయి వారిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

హెల్మెట్‌ధారణతో ప్రాణాలకు రక్ష : డీఎస్పీ

- జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీ

మార్కాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌ధారణతోనే ప్రాణాలకు రక్షణ ఉంటుందని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం జర్నలిస్టులు, పోలీసు సిబ్బందికి హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో 90 శాతానికి పైగా తలకు గాయాలు కావడంతోనే చనిపోతున్నారన్నారు. రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ వాడిన వాళ్లు దాదాపు ప్రాణాలు కాపాడుకుంటున్నారన్నారు. నూతన సంవత్సరం జనవరి 1 నుంచి వాహనదారులు హెల్మెట్ వాడకుంటే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, టూటౌన్ ఎస్సై రాజమోహనరావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మార్కాపురం పట్టణ, మండల, తర్లుపాడు మండల యూటీఎఫ్ స్వర్ణోత్సవాలలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు అన్ని రకాల వేధింపులకు గురయ్యారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వలేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అభివృద్ధి పనులకు నిధులు కూడా లేకుండా చేసిందన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గతంలో అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు ప్రభుత్వాన్ని గాడిలో పెట్టారన్నారు. త్వరలోనే ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి తన సొంతనిధులతో ప్రోత్సాహకాలను అందిస్తానన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, పాపయ్య, చలమయ్య, కాశిరెడ్డి, జయరామిరెడ్డి, రాజేష్, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖరయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం యాదవ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన మొర్రి పిచ్చయ్యను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, యాదవ సంఘం నాయకులు ఒ.వెంకటయ్య, బి.చంద్రశేఖర్‌యాదవ్, బి.వెంకటేశ్వర్లు, డి.శ్రీరాములు, యాదవ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సి.హెచ్.రవికాంత్, పి.చక్రపాణి, కె.పోలయ్య పాల్గొన్నారు.

- తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భం గా సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలుగునాడు మార్కాపురం డివిజన్ అధ్యక్షులు రెహమాన్, గౌరవాధ్యక్షులు బాలగురువులు, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.
- ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం డైరీని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని శ్రీనారాయణ విద్యాసంస్థల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ యామా సంజయ్, జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, కౌన్సిలర్ లొక్కు రమేష్, చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులు, నాయకులు డానియేలు, రజనీబాబు, దివాకర్, రాయలమ్మ, దేవదానం, మహర్షి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మార్కాపురం : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డివిజన్ అధ్యక్షులు రెహమాన్, గౌరవాధ్యక్షులు బాలగురువులు, ప్రధాన కార్యదర్శి మండ్ల శ్రీనివాసులు, సహ కార్యదర్శులు ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్‌రంగాన్ని నిర్వీర్యం చేసి.. నేడు ధర్నాలా

- విద్యుత్‌ఛార్జీల పెంపు పాపం వైసీపీదే
- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ విద్యుత్ రంగంలో విధ్వంసం సృష్టించి నిర్వీర్యం చేసిన నాటి పాలకుల పాపమే నేడు విద్యుత్‌ఛార్జీల భారానికి కారణమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రోడ్లెక్కి ధర్నాలు చేయడానికి అసలు వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సిగ్గుశరం లేదా? అని ప్రశ్నించారు. విద్యుత్‌రంగాన్ని నాటి ముఖ్యమంత్రి జగన్ సర్వనాశనం చేశారన్నారు. అన్ని రకాలుగా లూటీ చేసి రూ.1.29 లక్షల కోట్లకుపైగా అప్పుల భారాన్ని విద్యుత్‌శాఖపై మోపాడన్నారు. జగన్ అవినీతి కారణంగానే రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడిందన్నారు. 2014లో లోటు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2019 నాటికి మిగులు విద్యుత్ సాధించారన్నారు. అనంతరం గద్దెనెక్కి వైసీపీ చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేసిందన్నారు. దీంతో రూ.5లకు వచ్చే యూనిట్ విద్యుత్‌ను రూ.7కు పెంచి కొనుగోలు చేసి, నాటి వైసీపీ నాయకులు కమిషన్లు దండుకున్నారన్నారు. దీంతో ఆ భారం ప్రజలపై పడిందన్నారు. అప్పట్లో తక్కువ ధరకు లభించే సోలార్ విద్యుత్ విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. 10 వేల మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోయిందన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.49 వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. నిర్మాణం పూర్తయినప్పటికీ కృష్ణపట్నం వీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదన్నారు. సెకీ ఒప్పందం విషయంలో అమెరికా కోర్టులో జగన్‌పై కేసు నమోదైనా వైసీపీ నాయకులకు సిగ్గు రావడం లేదన్నారు. అంతేకాక ట్రూఅప్ చార్జీలను గత వైసీపీ పాలనలోనే పెంచారన్నారు. 2023 డిసెంబర్‌లో కూడా ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేయాలని ఆదేశించింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నాడు విద్యుత్‌రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్ నేడు ధర్నాకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు పఠాన్ ఇబ్రహీం, మాలపాటి వెంకటరెడ్డి, కనిగిరి బాలవెంకటరమణ, గులాబ్‌బాషా, మయూరి ఖాశిం, మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డిలు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ



ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న చప్పిడి రామలింగయ్య

పొదిలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవాసంస్థకు చప్పిడి ఝాన్సీరాణి జ్ఞాపకార్థం భర్త చిన్నరామలింగయ్య ఫ్రీజర్ బాక్స్‌ను ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడినై ఫ్రీజర్ బాక్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ చప్పిడి పెద్ద రామలింగయ్య, స్వచ్ఛంద సేవాసంస్థ మండల అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు



లోయలోకి దూసుకెళ్లిన కారు

పెద్దదోర్నాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేగం అదుపు తప్పిన ఓ కారు లోయలోనికి దూసుకెళ్లిన ఘటన శ్రీశైలం- దోర్నాల ఘాట్ రోడ్డులో చింతల సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన ఓ కుటుంబం కారులో దైవదర్శనం కోసం శ్రీశైలం వెళుతోంది. చింతల సమీపంలో రోడ్డులో గుంట ఉండడంతో పక్కకు తప్పించే క్రమంలో రక్షణ గోడను ఢీకొని అదుపు తప్పి పక్కన లోయలోకి దూసుకుపోయింది. అయితే అక్కడ లోతు తక్కువగా ఉండడం, చిల్లచెట్లు అధికంగా ఉండడంతో వాహనం ముందుకు వెళ్లలేక ఆగిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటి జరగలేదు. దీంతో వాహనంలో ప్రయాణించే వారు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేష్ ఘటనా స్థలాన్ని స్థలానికి చేరుకుని వాహనాన్ని బయటకు తీయించారు.

31న ఇంటి వద్దకే పింఛన్ : ఎంపీడీవో

ఎర్రగొండపాలెం రూరల్ : సామాజిక భద్రతా పింఛన్లు డిసెంబర్ 31నే ఇళ్ల వద్ద పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు 31 తెల్లవారుజాము నుంచే సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చిం పంపిణీ చేస్తారన్నారు. సచివాలయాలకు ఎవరూ రావద్దన్నారు. డిసెంబరు 31వ తేదీ సాయంత్రం 6 గంటలకు నూరు శాతం ఫించన్ పంపిణి పూర్తి చేయాలని ఎంపీడీవో ఆదేశించారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు పంపిణీని పర్యవేక్షించాలన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

కొమరోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుల మృతికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కొమరోలు మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ నాయకులు తోటా వెంకటేశ్వర్లు (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ నాయకుని స్వగ్రామమైన రాజుపాలెంకు వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. వీరివెంట నాయకులు గోడి ఓబుల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై అట్రాసిటీ కేసు

నాగులుప్పలపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిని కులం పేరుతో దూషించిన రౌడీషీటర్ పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు, మండలంలోని తిమ్మసముద్రం గ్రామం అంబేడ్కర్‌కాలనీకి చెందిన గోపతోటి నాగరాజువర్మకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన రౌడీషీటర్ నల్లూరి రాజాకు గతంలో పరిచయం ఉంది. ఇద్దరి మధ్య నగదు విషయంలో వివాదం వచ్చింది. ఈ నెల 28న తెల్లవారుజామున ఉప్పుగుండూరు గ్రామంలో ఉన్న సుబ్బయ్య హోటల్ వద్దకు నాగరాజువర్మ వచ్చాడు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న నల్లూరి రాజాను ఆయన డబ్బులు అడిగారు. దీంతో నాగరాజువర్మను కులం పేరుతో దూషించి తన దగ్గర ఉన్న చాకుతో దాడి చేశాడు. దీంతో గాయపడ్డ నాగరాజువర్మ చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ లో చేరారు. అక్కడి ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ రాజాపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్యసాయి సేవా సమితి సభ్యుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

పెద్దదోర్నాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం విలువలతో కూడిన నడక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శాంతి, ప్రేమ తదితరాలను ప్లాకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ సమాజంలో క్రమేపీ అంతరించి పోతున్న మానవతా విలువలను పునరుద్ధరించడానికి విశ్వవ్యాప్తంగా సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో విలువలతో కూడిన నడక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో సమితి సభ్యులు మొగిలి కిషోర్ గుప్తా, శేఖర్, వెంకట రమణారెడ్డి, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలువల కోసం నడక

గిద్దలూరు : సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం విలువల కోసం నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సత్యంగా ఉండాలని, ధర్మంగా పని చేయాలని, శాంతిప్రియులై ఉండాలని, ప్రేమ తో మెలగాలని, అహింసను విడనాడాలని ప్లేకార్డులు చేతబూని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మానవతా విలువలు ప్రతి ఒక్కరూ పాటించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సేవాసమితి ప్రతినిధులు శింగరి ప్రసాద్, ముప్పూరి కాశీశ్వరరావు, గోళ్ళ క్రిష్ణమూర్తి, వాడకట్టు లక్ష్మీనారాయణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొనగా బాలవికాస్‌కు చెందిన బాలబాలికలు, గురువులు ర్యాలీలో పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

గిద్దలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలునాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి అన్నారు. రెవెన్యూ కార్యాలయం ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, బీజేపీ కోకన్వీనర్ గుమ్మా రాముడు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలలో ఎస్సీ కులాల జాబితాను సరి చూసుకోండి

కంభం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాలలో వీఆర్‌వోలు వద్ద ఎస్సీ కులాల జాబితా అందించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నేదురుమల్లి జయరాజ్ తెలిపారు. ఆ కులాల జాబితాలో కులం పేరు తప్పుగా నమోదైతే సరి చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాల స్వయంప్రతిపత్తిగా చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం వెల్లడించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీనిపై కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులాల జాబితాలను ప్రతి సచివాలయంలో వీఆర్‌వోలకు అందజేసిందన్నారు. ఆ జాబితాలో ఎవరికి వారు కులం సక్రమంగా ఉందో, లేదో చూసుకుని సరి చేసుకోవాలన్నారు.

అటవీ సంరక్షణపై కళాజాత



వనసంరక్షణపై అవగాహన కార్యక్రమంలో కళాజాత బృందం, ఉద్యోగులు

గిద్దలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణపై అటవీశాఖ ఆధ్వర్యంలో రాచర్ల మండలం ఆకవీడులో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. తురిమెళ్ల రేంజ్ ఎఫ్ఆర్‌వో మధుప్రియాంక మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం వలన సమస్త జీవకోటికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి పెంచిన చెట్లు కాలిపోవడమే కాకుండా వన్యప్రాణులకు నష్టం కలుగుతుందన్నారు. నిలువ నీడలేకుండా పోతుందన్నారు. వాతావరణ కాలుష్యం పెరిగి ఆ ప్రభావం ప్రజలందరూ అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అడవులను సంరక్షించేందుకు ముందుకు రావాలన్నారు. కళాజాత ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో పాటలతో అవగాహన కల్పించారు. సర్పంచ్ దేవదానం, డిప్యూటీ ఆర్‌వో బాలాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



ప్రత్యేక అలంకరణ పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శంఖారావం జయప్రదం కోరుతూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమై ప్రధాన వీధుల మీదగా సాగి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ముగిసింది. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ జిల్లా అధ్యక్షులు వీరారావు, హిందూ సంఘాల నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రంగస్వామి, శ్రీధర సాయి సుబ్బారావు, గుంటక సుబ్బారెడ్డి, దేవిశెట్టి చంద్రశేఖర్, అంజిరెడ్డి, పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

అమాంతం పెరిగిన కోడిగుడ్డు ధర

- మార్కెట్‌లో రూ.8 పలుకుతున్న వైనం



అమ్మేందుకు సిద్ధంగా ఉన్న గుడ్లు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధరలు నానాటికి పెరిగిపోతున్నాయి. ఎర్రగొండపాలెం మార్కెట్ లో నిన్నటి వరకు ఒక గుడ్డు రూ.6 నుండి రూ.7 వరకు ఉంది. అయితే ఆదివారం మార్కెట్‌లో రూ.8 ఉంది. అంటే డజన్ గుడ్లు రూ. 96 పలుకుతుంది. దీంతో కోడి ధరతో గుడ్డులు పోటీ పడుతున్నాయని సామాన్యుడు బెంబేలెత్తున్నాడు. ప్రోటీన్ల మాట పక్కన పెడితే అవి కొనుగోలు చేసే పరిస్థితిలో సామాన్యుడు లేరని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పలు దుకాణాల్లో తనిఖీలు

దర్శి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతల అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఆశాఖ అధికారి మొహిసీన్ సిబ్బందితో కలిసి దుకాణాల్లో కాటాలు పరిశీలించారు. ఒక మటన్ షాపు కాటాలో తేడా ఉండటంతో రూ.3 వేలు జరిమానా విధించారు. కాటాల తనిఖీ అనంతరం స్టాంపింగ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటాలను క్రమంతప్పకుండా స్టాంపింగ్ చేసుకోవాలన్నారు. తూనికలు కొలతల్లో తేడా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి

దొనకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాటాలు చేయటం ద్వారానే హక్కులు సాధించుకోవటం జరుగుతుందని సీఐటీయూ నాయకుడు తాండవ రంగారావు పేర్కొన్నారు. ఆదివారం దొనకొండలో పంచాయతీ పారిశుధ్య కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక చట్టాలు రద్దు చేయాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుపల్లి అంజయ్య, పి.లూకయ్య, వైదన ఇశ్రాయేలు, ఎగ్గోని ఒర్సు, అరవ రాణి, కొండా ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

కోనేరు హంపి విజయం దేశానికి గర్వకారణం

దర్శి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఫిడే మహిళల ప్రపంచ రాపిడ్ చెస్ చాంపియన్ పోటీల్లో కోనేరు హంపి విజయం సాధించటం దేశానికి గర్వకారణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశంసించారు. ఆమె ప్రపంచ స్థాయి పోటీల్లో విజయం సాధించటంతో దిశదశలా తెలుగు ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని అన్నిరంగాల్లో విజయపథంలో ముందుకు సాగాలని సూచించారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. కోనేరు హంపి మరిన్ని విజయాలను సాధించాలని, దేశానికి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా

కనిగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం జీవితానికి ఎంతో భరోసా ఇస్తుందని ఆపార్టీ సీనియర్ నాయకుడు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేతులమీదుగా ఆదివారం టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డామన్నారు. చంద్రబాబు సారధ్యంలో క్రమశిక్షణగల పార్టీగా నిలిచిందన్నారు. చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తామని తెలిపారు.

అర్హులైన వీఆర్వోలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో)లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించే విధంగా రాష్ట్ర సంఘం ప్రత్యేక చొరవ తీసుకోవాలని వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వైసీ రంగయ్య కోరారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన జిల్లాకు సంబంధించిన పలురకాల సమస్యలను విన్నవించారు. బయోమెట్రిక్ విధానం వల్ల వీఆర్వోలు గ్రామాల్లో నెట్‌వర్క్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేవిధంగా ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర సంఘం తీసుకెళ్ళాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను భర్తీతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న వీఆర్వోలే ఖాళీగా ఉన్న గ్రామాలను కూడా చూడాల్సిరావడంతో పనిభారంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్ళ నుంచి బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గౌరవవేతనం అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేసే దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు అరికల వెంకటరామయ్య, రాష్ట్రకార్యవర్గసభ్యులు రవికుమార్, బెంజిమెన్, నల్లమేకల నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు రాజ్యాం గ స్ఫూర్తికి విరుద్ధమని జేవీవీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జిల్లా కోశాధికారి బి.తిరుపతయ్య అధ్యక్షతన జేవీవీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఏ వీ.పుల్లారావు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు సమాఖ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టు అని, సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు యు.భాస్కర్ మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి మెడికల్ క్యాంపు జనవరి 5 ఒంగోలులో జరుగుతుందని తెలిపారు. జిల్లా బాలోత్సవం క మిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వీరాంజనేయులు, జేవీవీ గౌరవ సలహాదారులు కె. సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ ఒంగోలులో ఫిబ్రవరి 7,8తేదీల్లో ప్రకాశం బా లోత్సవం పిల్లల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరాన్ని యువత మద్యంతో కాకుండా కుటుంబాలు, సన్నిహితులు, స్నేహితులతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ జయప్రకాష్, జడ్.రమణయ్య, యు.వెంకట్రావు, బాలునాయక్, శ్రీనివాసరెడ్డి, రామన్, జి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎన్నెస్పీ క్వార్టర్స్

- అనధికారికంగా కొందరు వినియోగం
- ప్రభుత్వ భవనాలకు స్థలాలు లేక అవస్థలు
- చోద్యంచూస్తున్న అధికారులు



రామభద్రాపురంలో గేదెలకు ఆవాసాలుగా మారిన ఎన్నెస్పీ క్వార్టర్స్

తాళ్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్పీ) క్వార్టర్లు నిరుపయోగంగా మారాయి. కొందరు వీటిని అనధికారికంగా వినియోగించుకుంటున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

నాలుగు దశాబ్దా క్రితం మండలంలోని తాళ్లూరు, రామభద్రాపురం గ్రామాల్లో ఎన్ఎస్పీ క్వార్టర్లు నిర్మించారు. వీటిలో కొన్ని శిథిలమయ్యాయి. మరికొన్నింటిని ఆక్రమించుకుని వినియోగించకుంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అధికారులు, సిబ్బంది నివాసం కోసం తాళ్లూరు, రామభద్రాపురం గ్రామాల్లో 40 క్వార్టరు నిర్మించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వభూములు లేకపోవటంతో పట్టాభూములను కొనుగోలు చేసి క్వార్టర్లు నిర్మించారు. 15 ఏళ్ల పాటు ఎన్నెస్పీ అధికారులు, ఉద్యోగులు వీటిల్లో నివాసముంటూ కాలువ తవ్వక పనులు చేపట్టారు. పనులు పూర్తయిన అనంతరం వీరంతా క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లారు. దీంతో నిరుపయోగంగా ఉన్నాయి.

అనంతరం తాళ్లూరు మండలంగా ఏర్పాటయినప్పుడు రెవెన్యూ, పోలీస్ స్టేషన్లను నిరుపయోగంగా ఉన్న తాళ్లూరు ఎన్నెస్పీ క్వార్టర్లలో నిర్వహించారు. ఇవి పరిపాలనకు సౌలభ్యంగా లేకపోవటం, క్వార్టర్లు శిథిలావస్థకు చేరటంతో కార్యాలయాలను మార్చుచేశారు. అప్పటి నుంచి క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. దీంతో గ్రామంలోని కొందరు క్వార్టర్లను అనధికారికంగా స్వాధీనం చేసుకుని నివాసం ఉంటున్నారు. ఇక్కడే గేదెల పాకలు, గడ్డివాములు వేసుకుని క్వార్టర్లలోని జీవనం సాగిస్తున్నారు. వాటి విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.లక్షల్లో ఉంది. క్వార్టర్లలో చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. నలభై ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.

ఇదిలాఉండగా, తాళ్లూరులో ప్రభుత్వ భవనాలకు అనువైన ప్రభుత్వ భూములు లేవు. 13 ఏళ్ల క్రితం అప్పటి పోలీస్ శాఖ అధికారులు నిరుపయోగంగా ఉన్న తాళ్లూరులోని క్వార్టర్స్‌ను అప్పగిస్తే పోలీస్‌స్టేషన్, క్వార్టర్లు నిర్మిస్తామని చెప్పినప్పటికీ ఆస్థలాన్ని ఎన్నెస్పీ అధికారులు పోలీసులకు అప్పగించ లేదు. క్వార్టర్స్ ఖాళీగా ఉండటంతో కొందరు అక్రమంగా నివాసముంటున్నారు. శిథిలమైన క్వార్టర్లకు చెందిన రాళ్లు, కలపను గతంలో కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. రామభద్రాపురంలోనూ దాదాపు రెండు ఎకరాల్లోని ఎన్నెస్పీ క్వార్టర్లు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ భూములను రక్షిస్తామంటూ అధికారయంత్రాంగం చెబుతున్న మాటలు అమలుకు నోచుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈగ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనం నిర్మాణానికి స్థలాలు లేవు. అధికారులు మాత్రం ప్రభుత్వానికి చెందిన భూములు పరుల ఆధీనంలో ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపణలు వస్తున్నాయి.

తాళ్లూరులో దశాబ్దాలకాలం క్రితం పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. ఇక్కడ సిబ్బందికి క్వార్టర్లు లేవు. అందుకు సరిపడ స్థలం లేక శాశ్వత భవనాలు నిర్మితం కాలేదు. తాళ్లూరులోని ఎన్నెస్పీ క్వార్టర్స్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్, క్వార్టర్స్‌ను నిర్మించాలని పోలీస్ శాఖ ప్రతి పాతిపాదనలు పంపినా అమలుకు నోచుకోలేదు. ఎన్నెస్పీకి చెందిన స్థలాలు అన్యాక్రాంతంలో ఉన్నా ఆశాఖ అధికారులు వాటిని పరిశీలించి తగు రక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాళ్లూరు, రామభద్రాపురం గ్రామాల్లో పరుల ఆధీనంలో వున్న ఎన్నెస్పీ క్వార్టర్లను స్వాధీనం చేసుకుని ప్రభుత్వభవనాల నిర్మాణానికి వినియోగ పడేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకారం



ఎమ్మెల్యేకు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న కృష్ణారెడ్డి, మిత్రబృందం

కనిగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో అన్నిరకాల వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి లక్ష్యానికి సహకారాన్ని అందిస్తామంటూ ప్రముఖులు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే లక్షలాది రూపాయలు తన సొంతత నిధులను వెచ్చించి అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. ఆయనకు చేదోడుగా కనిగిరి ప్రాంతానికి చెందిన ఎంతోమంది ప్రముఖులు, ఉద్యోగులు, రాజకీయ నేతులు, వ్యాపారవేత్తలు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి పనులకు తమవంతు సహకారాన్ని అందజేశారు. ఈక్రమంలో కనిగిరి పట్టణంలోని కొత్తూరు ప్రాంతానికి చెందిన పుల్లూరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను క్యాంపు కార్యాలయంలో కలసి అందచేశారు. కార్యక్రమంలో తమ్మనేని ప్రభాకర్ రెడ్డి, కందుల వెంకటరెడ్డి, నారపురెడ్డి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి రూ.25 వేల విరాళం

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఉగ్ర కనిగిరి ప్రభుత్వ వైద్యశాలను సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుతున్న నేపథ్యంలో తన వంతుగా సి.నాగులారం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ హస్తి వీరాంజనేయులు యూటీఎఫ్ నాయకులతో కలిసి రూ.25 వేల నగదును కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో కలిసి అందజేశారు. ఈసందర్భంగా ఉగ్ర దాతను అభినందించారు.

కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్. వెంకటరామయ్య, షేక్ పాదుషా, ఐ.కొండయ్య, జె.వెంకట్రావు, ఎం.శ్రీనివాసులు, ఎం. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

ముండ్లమూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని సమగ్ర శిక్ష అభియాన్ సెక్రటరీ డి.దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముండ్లమూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ కష్టపడి చదివినట్లయితే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. విద్యార్థినులకు అర్థమయ్యేరీతిలో విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజు పరీక్షలు నిర్వహించి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమన్నారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థినులకు గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

అనంతరం విద్యార్థినులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఆవుల సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న నేల బావి

ఆదమరిస్తే అంతే సంగతులు

పామూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి 167-బి దూబగుంట గ్రామం వద్ద రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. ప్రతి నిత్యం ఈమార్గం ద్వారా మైదుకూరు, భైరవకోన, నారాయణస్వామి, అనుమునిగిరి లాంటి శైవక్షేత్రాలకు వాహనాల్లో భక్తులు వెళుతుంటారు.

రాత్రి సమయాల్లో వాహన చోదకులు ఆద మరిస్తే ప్రమాదాలు పొంచిఉన్నాయి. జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ తాత్కలికంగా తగిన రక్షణ చర్యలు చేపట్టి ఉన్నప్పటికీ శాశ్వత చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు

- వార్డెన్‌పై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆగ్రహం
- హాస్టల్‌లో అపరిశుభ్రతపై అసహనం



హాస్టల్‌లో వసతులపై విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ 2 హాస్టల్ వార్డెన్ తీరుపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎస్సీ బీసీ హాస్టల్స్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇది హాస్టల్ ప్రాంగణమేనా అంటూ వార్డెన్ నాయక్‌ను ప్రశ్నించారు. హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవటానికి గల కారణాలు అడిగారు. హాస్టల్ అపరిశుభ్రంగా ఉంటే స్వీపర్, పారిశుధ్య సిబ్బంది ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారుల ద్వారా చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

ఏం పిల్లలూ ఎలా ఉన్నారు..

ఏం పిల్లలూ.. ఎలా ఉన్నారంటూ బీసీ హాస్టల్ విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి యోగక్షేమాలు విచారించారు. బీసీ హాస్టల్‌లోని టాయిలెట్స్‌ను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న భోజన సౌకర్యం, మెనూ, ప్రత్యేక తరగతులపై విచారించారు. వార్డెన్ తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యం, తదితరులు ఉన్నారు.

యడవల్లి గ్రామాభివృద్ధికి చేయూత

- బాల్య జీవితం మరచిపోలేనిది!
- ఐఆర్ఎస్ అధికారి సురేష్‌బాబు



చిన్ననాటి స్నేహితులతో కలసి గడిపిన మైసూర్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ అధికారి సురేష్‌బాబు

కనిగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య జీవితం మరచిపోలేనిదని మైసూర్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్(ఐఆర్ఎస్) అధికారి పీవీఎస్ సురేష్‌బాబు అన్నారు. తన చిన్ననాటి స్నేహితులను ఆదివారం కలిశారు. తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని వారితో గడిపారు. కనిగిరి మండలంలోని యడవల్లి యడవల్లి గ్రామానికి చెందిన ఆయన స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివారు. ఆతర్వాత తన తల్లిదండ్రులు బెంగుళూరు వెళ్ళటంతో ఆయన విద్యాభ్యాసం బెంగుళూరు ప్రాంతంలో జరిగింది. ఆదివారం తన స్వగ్రామం చూసేందుకు వచ్చిన ఆయన తన చిన్ననాటి బాల్యమిత్రులను కలసి ఎంతో ఆనందంగా గడిపారు. స్నేహితుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

తన స్వగ్రామం యడవల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆ అధికారి చిన్ననాటి స్నేహితులు జొన్నలగడ్డ సురేష్, ముచ్చర్ల ధర్మ, ఏలూరి సురేష్, మీరావలి, టీడీపీ మస్తాన్‌వలి, వేమా రంగా, స్టుడియో రమేష్, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిగంగ సన్నిధిలోగల గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని పూజించారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొనసా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఆర్ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

ముండ్లమూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లపల్లిలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీపోలేరమ్మ అమ్మవారి మూడవ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఊరేగింపుగా నైవేద్యాన్ని తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకులు తేలుకుట్ల కొండలు, పూజారి ఆంజనేయులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపుతో పాటు భజనలు నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించరు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు నారాయణస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించి నూతన వస్త్రాలను తొడిగారు. అనంతరం ఆలయ గాలి గోపురం నుంచి మేళతాళాలతో స్వామి వారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ మాజీ అధ్యక్షుడు పాములపాటి మాధవప్రసాద్, రమణమ్మ దంపతులు భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు గంధ మహోత్సవం



గంధ మహోత్సవానికి ముస్తాబైన దర్గా

పామూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని ఆకులవీధిలో గల శ్రీహజరత్ మహబూబ్ సుభాని స్వామి దర్గా 49వ గంధమహోత్సవ వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దాతలు అందించిన ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా దర్గాకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రేమ, కరుణతో జీవించాలి

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ తోటి వారిపట్ల ప్రేమ, కరణతో జీవించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు గూడూరి వినోద్‌కుమార్ తెలిపారు. సీఎస్‌పురంలోని కల్వరి కృపా ప్రార్థనా మందిరంలో ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏ.ప్రభుదాస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా పలువురు పేద వితంతులకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు పడుచూరి యేసేబు, గూడూరి సదానందం, జి.మధు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉమ్మడిశెట్టి శ్రీను



బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనును అభినందిస్తున్న రమణయ్య

పామూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉమ్మడిశెట్టి శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్టు ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం మండల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జె.చినసుబ్బయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో కేవీ రమణయ్య, మండల ఆర్వో వి.వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల రమణారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీఎస్‌పురం మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకటసత్యం, అనిల్, అవినాష్, నవీన్, రాంప్రసాద్, ఎస్.శివకృష్ణ, చరణ్, సతీష్, పటాన్ అంజాద్, శ్రీహరి, బ్రహ్మం, పి.శ్రీనివాసులు, హజరత్‌కుమార్, పాడే అరవింద్, మనోజ్ పాల్గొన్నారు.

5న జొన్నవిత్తులకు పురస్కారం

అద్దంకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వేద కవి, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం 2025ను ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు అద్దంకిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. డీవీఎం సత్యనారాయణ రచించిన వ్యాస మంజూష పుస్తకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం అద్దంకిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ తెలుగు బాష వ్యాప్తి కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న బహుముఖప్రజ్ఞావంతుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు పురస్కారాన్ని ప్రదానం చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యూ దేవపాలన, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డీవీఎం సత్యనారాయణ, వారణాసి రఘురామశర్మ, నిమ్మరాజు నాగేశ్వరరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, మురళీసుధాకర్ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడు మృతి

బల్లికురవ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్ల గంగమ్మ కొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గ్రానైట్ కార్మికుడు వివేకానందరెడ్డి (29) ఆదివారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన వివేకానందరెడ్డి బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో క్రేన్ ఆపరేటర్‌గా ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. క్వారీలో పనిచేసే ముఠా మేస్త్రీ వెంకటేష్‌తో కలిసి బల్లికురవ వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా ఆగి ఉన్న గ్రానైట్ లారీని ఢీకొట్టారు. ఈప్రమాదంలో బైకు నడుపుతున్న తమిళనాడుకు చెందిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన వివేకానందరెడ్డిని వెంటనే తోటి కార్మికులు చిలకలూరిపేట వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ వివేకానందరెడ్డి కూడా మృతి చెందాడు. ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ (పాతచిత్రం)

కూటమి.. క్లీన్ స్వీప్

ఎన్నికల నామ సంవత్సరంగా 2024

2024.. ఎన్నికల సందడితో ప్రారంభమవగా ప్రజా తీర్పుతో జిల్లాలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. నాలుగున్నరేళ్లపాటు వివిధ సమస్యలపై అధికార వైసీపీపై అలుపెరగని పోరాటం చేసిన విపక్షాలు ఎన్నికల వేళ తీర్పును కోరుతూ ప్రజల ముందుకు వెళ్లిన ఘట్టానికి 2024 సాక్ష్యంగా నిలిచింది. కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలతో విజయ దుందుభి మోగించారు. కక్ష సాధింపులు.. కేసులు.. నిర్బంధాలు.. అమరావతి నిర్వీర్యం.. తదితరాలతో విసిగివేసారిన ఓటర్లు వైసీపీ ఫ్యాన్ రెక్కలను విరిచేశారు. ఇక ముందెన్నడూ ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా పరిపాలన సాగించాలంటే భయపడి పోయేలా ఓటర్లు తీర్పు ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైసీపీపై ఎంతటి ఆదరణ చూపారో అంతకంటే అధికంగా 2024 ఎన్నికల్లో వ్యతిరేకించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా తీర్పు కోరగా.. అదే స్థాయిలో ఓటర్లు కూడా కలిసికట్టుగా ఎక్కడా ఓటు చీలిపోకుండా కూటమి అభ్యర్థులపై అభిమానం చూపి ఓట్ల వర్షం కురిపించారు. రాజధాని అమరావతి కేంద్రంగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయం అందరూ ఊహించినదే అయినా మెజార్టీలను చూసి నేతలే ఆశ్చర్యపోయేలా ఓటర్లు తీర్పు చెప్పారు. తమని ఐదేళ్లపాటు నరకయాతనకు గురి చేసిన అప్పటి అధికార పార్టీని మట్టుబెట్టాలని ఓటర్లంతా కలిసికట్టుగా నిర్ణయించుకుని మరీ ఓట్లు వేయడం విశేషం.

- లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలన్నింటా విజయదుందుభి
- నామరూపాలు లేకుండా తుడిచి పెట్టుకుపోయిన వైసీపీ
- బొప్పూడిలో ఎన్నికల ప్రచార సభకు ప్రధాని మోదీ హాజరు
- పోలింగ్ రోజున గుంటూరు, బాపట్లలో ప్రశాంతం.. పల్నాడులో రణరంగం



రికార్డు మెజార్టీలు..

మంగళగిరిలో వైసీపీ ఓటుకు రూ.4 వేలు పంచి పెట్టినా నారా లోకేశ్ 90 వేల పైచిలుకు మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చరిత్రలో ఇదొక రికార్డుగా నిలిచింది. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి గతంలో ఏ ఎంపీకి రానంత మెజార్టీ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి 3 లక్షల 44 వేల పైచిలుకు వచ్చింది. అలానే గుంటూరు పశ్చిమ నుంచి బరిలో నిలిచిన గళ్లా మాధవికి 55 వేల ఓట్ల మెజార్టీ లభించింది. గత 20 ఏళ్ల నుంచి టీడీపీ గెలుచుకోలేకపోయిన గుంటూరు తూర్పులో నసీర్ అహ్మద్, నరసరావుపేటలో చదలవాడ అరవిందబాబు, మాచర్లలో బ్రహ్మారెడ్డి, బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ, మంగళగిరిలో నారా లోకేశ్ భారీ మెజార్టీలతో గెలుపొందారు. కూటమికి కేటాయించిన తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ మంచి మెజార్టీతో విజయం సాధించారు. లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలు(నరసరావుపేట), టీ కృష్ణప్రసాద్(బాపట్ల) కూడా భారీ మెజార్టీలతో గెలిచి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు.




బాపట్ల, గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు రాజకీయ చరితలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అన్ని వర్గాలు ఏకమై వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా పని చేశాయి. భారీ ఓట్ల ఆధిక్యంతో టీడీపీ కూటమి నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించి వైసీపీకి చెంప చెళ్లుమనిపించారు. పోలింగ్ రోజున వైసీపీ అరాచకాలను అడ్డుకునేందుకు ప్రజలే తిరగబడ్డారంటే ఎంతగా వారిలో ఆ పార్టీపై ఆగ్రహం గూడుకట్టుకుందో అంచనాకు రావొచ్చు. గొడ్డలి వేటులను సైతం మహిళలు ఎదుర్కోవడం, ఓటరు మీద దాడికి దిగిన ఒక ఎమ్మెల్యే చెంప పగలగొట్టడం వంటి అనేక ఓటర్లను చైతన్యపరిచే సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల సంవత్సరంగా 2024 ప్రారంభమైంది. అప్పటికే ఓటరు జాబితాల్లో కూటమి సానుభూతిపరుల ఓట్లను భారీ సంఖ్యలో తొలగించేందుకు వైసీపీ చేసిన ప్రయత్నాలను కూటమి నేతలు అడ్డుకున్నారు. జనవరి నుంచే ఎన్నికల వాతావరణం పూర్తిగా జిల్లాలో వచ్చేసింది. అన్ని పార్టీల నేతల పర్యటనలు, బహిరంగ సభలు, రోడ్డు షోలతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల కోడ్ ప్రకటించిన వారంలోనే ప్రధాని నరేంద్రమోదీ ప్రచారానికి పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి, మూడు పార్టీల

(మిగతా 8వ పేజీలో)

2024 రాజకీయ ముఖచిత్రం

వైసీపీ.. కకావికలం

వైసీపీకి రాజకీయంగా చేదు గుళికలను మిగిల్చిన ఏడాదిగా 2024ను చెప్పవచ్చు. మూడు జిల్లాల పరిధిలోని 20 అసెంబ్లీ స్థానాల, మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో దారుణ పరాజయం చవిచూసింది. దీంతో పాటు రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలన్నీ వికటించి అంతర్గత కుమ్ములాటలకు కారణమయ్యాయి. ఫలితాల తర్వాత వైసీపీ పరిస్థితి మూడు జిల్లాల్లోనూ మరింత దిగజారింది. ఎన్నికల ముందు వరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పార్టీ పదవితో పాటు ఎంపీ పదవికి కూడా రాజీనామా చేసి సైకిలెక్కారు. ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా పార్టీని వీడారు. ఈ పరిణామా లన్నీ కూడా వైసీపీని రాజకీయంగా కోలుకోలేని విధంగా చేశాయి.



కాలేజీల్లోనూ.. మధ్యాహ్న భోజనం

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోన్న మధ్యాహ్న భోజనం పథకాన్ని జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నూతన సంవత్సరం సందర్భంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గత టీడీపీ ప్రభుత్వం 2019 వరకు అమలు చేసిన పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 21 జూనియర్ కళాశాలలు, అద్దంకి, చీరాల, పర్చూరు పరిధిలోని నాలుగు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 25 కళాశాలల్లోని సుమారు 11 వేల మందికిపైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని జనవరి 3 నుంచి అమలు చేయనున్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పల్నాడు జిల్లాలోని తొమ్మిది కళాశాలల్లోని 1,510 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. అలాగే గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఇంటర్‌మీడియట్ జూనియర్, సీనియర్ విద్యార్థులకు కూడా లబ్ధి చేకూరనుండటంతో తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జూనియర్ కళాశాల విద్యార్థులకు తీపికబురు
- పథకాన్ని పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం
- 3 నుంచి అమలుకు విద్యాశాఖ అధికారుల ఏర్పాట్లు
- గుంటూరు, బాపట్ల, పల్నాడులోని 25 కళాశాల్లో అమలు



సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వం అమలు చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే ఉంటారని భావించిన నాటి టీడీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మాదిరిగానే మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసింది. పైగా మండల కేంద్రాల్లో ఉండే కళాశాలలకు సుదూరంగా ఉండే గ్రామాల నుంచి ఉదయం 7 గంటలకే ఇళ్ల నుంచి విద్యార్థులు బయలుదేరుతుంటారు. చాలా గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేక సైకిళ్లపైనే

(మిగతా 8వ పేజీలో)

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- రేపు యలమందలకు చంద్రబాబునాయుడు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ
- ముఖ్యమంత్రి పింఛన్ అందజేసే లబ్ధిదారుడి ఇంటిని పరిశీలించిన అరుణ్‌బాబు

నరసరావుపేట, నరసరావుపేట రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఏదోఒక గ్రామంలో నేరుగా లబ్ధిదారులను కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. జనవరి నెలకు సంబంధించిన పింఛన్‌ను ఒకరోజు ముందుగా మంగళవారం పంపిణీ చేయనున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు నరసరావుపేట నియోజకవర్గం యలమంద గ్రామంలో ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పర్యటించనున్నారు. హెలిప్యాడ్ నిర్మాణం పూర్తయింది. యలమందలలో సభావేదిక పనులు వేగవంతం చేశారు. ముఖ్యమంత్రి ద్వారా వేదిక వద్ద పింఛన్లు ఇప్పించేందుకు పది మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు సీఎం వెళ్లి పింఛన్లు ఇవ్వనున్న నేపథ్యంలో ఆ ఇళ్లను కలెక్టర్ అరుణ్‌బాబు ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగించేందుకు వేదికను సిద్ధం చేస్తున్నారు. త్రికోటేశ్వరస్వామిని చంద్రబాబు దర్శించుకోనున్న నేపథ్యంలో దేవదాయశాఖ కోటప్పకొండలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. యలమందల, కోటప్పకొండలో ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ, జేసీ సూరజ్‌తో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కడియాల రమేష్‌బాబు ఆదివారం పరిశీలించారు.

షెడ్యూల్ ఇలా..

10.30	ఉండవల్లి నుంచి బయలుదేరుతారు
10.50	హెలికాప్టర్‌లో యలమందలకు
11.30	లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
12.35	గ్రామంలోని లబ్ధిదారులతో భేటీ
1.00	వరకు ప్రజాప్రతినిధులతో సమావేశం
01.30	రోడ్డుమార్గాన కోటప్పకొండకు
2.15	త్రికోటేశ్వరస్వామి దర్శనం
2.30	యలమందలలోని హెలిప్యాడ్‌కు
2.55	ఉండవల్లి నివాసానికి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల, కడియాల రమేష్ తదితరులు



చంద్రబాబు పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారుడి ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ప్రత్యేక పోలీసు బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రత్యేకంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఎస్పీలు సంతోష్, సత్తిరాజు, డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐలు సురేష్‌బాబు, శరత్‌బాబు, రామకృష్ణ తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

ముగ్గురిపై వేటు?

- ఇసుక అక్రమాలపై కలెక్టర్ కన్నెర్ర
- బోయినవారిపాలెం ఘటనపై ఎమ్మెల్యే సీరియస్

చీరాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చీరాల పరిధిలో ఇసుక అక్రమాల్లో ఆధిపత్యపోరు తారాస్థాయికి చేరింది. చీరాల మండలం బోయినవారిపాలెం పరిధిలో ఓ ఎక్స్‌కవేటర్‌ను తగలబెట్టడం అందుకు పరాకాష్టగా నిలుస్తోంది. ఈ క్రమంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి ముగ్గురు రెవెన్యూ అధికారులపై కలెక్టర్ జె.వెంకటమురళి వేటు వేసినట్లు సమాచారం. దీనిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఇదేక్రమంలో పోలీసు శాఖకు సంబంధించి కూడా తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. బోయినవారిపాలెం ఘటనను ఎమ్మెల్యే కొండయ్య తీవ్రంగా పరిగణించారు. నిందితులు ఎవరైనా నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఆ క్రమంలో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఎక్స్‌కవేటర్ కాల్చిన వ్యక్తి అరెస్టు

బోయినవారిపాలెం టీపీ స్కీమ్ వద్ద ఎక్స్‌కవేటర్‌ను దహనం చేసిన కేసులో నిందితుడు సతీష్ అనే వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడు నెల్లూరు జిల్లా వీవీపాలెం మండలం ఎస్పాలేనికి చెందిన వ్యక్తి అన్నారు.

అన్నదాతల్లో ఆందోళన

- దిగుబడులు ఆశాజనకం.. తగ్గిన ధర
- రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లలో జాప్యం

అద్దంకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ధాన్యానికి సరైన ధర లేక పోవడం.. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో, బోరు బావుల కింద వరి సాగు చేయగా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు తగ్గిపోతున్నాయి. అదే సమయంలో రైతులు మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల్లో విక్రయించాలనుకున్నా అక్కడ జరుగుతున్న జాప్యం, కొర్రీలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి, పంగులూరు మండలాల పరిధిలో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు సరాసరిన 35 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. అయితే గత ఏడాది బోరు బావుల కింద సాగు చేసిన బీపీటీ రకం ధాన్యం ధర రూ.2200 నుంచి రూ.2500 వరకు ఉంది. అదే ధర ఉంటుందని ఆశించిన రైతులకు ప్రస్తుతం నిరాశే మిగిలింది. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా 76 కిలోల బస్తా రూ.1740 కొనుగోలు చేస్తోంది. మేదరమెట్లలోని వెంకటసాయి రైస్‌మిల్, అద్దంకిలోని బాలాజీ రైస్‌మిల్‌కు ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే మేదరమెట్లలోని రైస్‌మిల్ నిర్వాహకులు మాత్రమే కొనుగోళ్లు చేపట్టారు. రెండు, మూడు రోజుల తర్వాత కొనుగోళ్లు చేసేలా అద్దంకిలోని రైస్‌మిల్ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అల్పపీడనాలు, వర్షాలతో కోతలను వాయిదా వేసుకున్న రైతులు ప్రస్తుతం అనుకూల వాతావరణంతో కోతలు, నూర్పిళ్లను ప్రారంభించారు. దీంతో ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వస్తున్నాయి. అయితే మిల్లర్లు రేపు మాపు అంటూ వాయిదాలు వేస్తున్నారు. తేమ శాతం మెలికతో ధాన్యాన్ని ఆరబోయాల్సి రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవగా వ్యాపారులు ధరలు మరింత తగ్గించారు. 75 కిలోల బస్తా బీపీటీ రకం రూ.1400 మించి కొనుగోలు చేయడం లేదు. ఎక్కువ మిల్లర్లకు అనుమతులు ఇచ్చి కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

వి.కొప్పెరపాడులో బస్తాలకు కుట్లు వేస్తున్న కూలీలు





బల్లికురవ మండలం గుంటుపల్లిలో ఆరబోసిన ధాన్యం

ధరలు మరింత తగ్గాయి



బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు మరింత తగ్గాయి. గత ఏడాది బీపీటీ రకం ధాన్యం బహిరంగ మార్కెట్‌లో రూ.2200 నుంచి రూ.2500 వరకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది రూ.1400 మించి అడగడం లేదు.

\- బొంత వీరయ్య, బల్లికురవ

అదిగోఇదిగో అంటున్నారు



రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం అమ్ముకునేందుకు మేదరమెట్ల రైస్ మిల్ నుంచి వచ్చి శాంపిల్ తీసుకెళ్లారు. ధాన్యం సిద్ధంగా ఉన్నా తీసుకు పోయేందుకు అదిగోఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు పడుతుండడంతో కోతలు, నూర్పిళ్లు ఆలస్యమయ్యాయి. కొనుగోళ్లను వేగవంతం చేయాలి.

\- కామినేని శ్యామలరావు, వి.కొప్పెరపాడు

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

- ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్‌బాబు

బాపట్ల డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం 78వ వార్షిక జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశానికి జిల్లాలోని 25 మండలాల నుంచి శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి జోసఫ్ సుధీర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ఖర్చు పెట్టేసి మొండిచేయి చూపించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు అయినప్పటికీ పెండింగ్ బకాయిల విషయంలో నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించటం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ఆగ్రహం తెప్పిస్తుందన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. 117 జీవో రద్దు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అనేక రకాలైన యాప్‌ల వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరం కావటంతో పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఒకే సమయంలో ఓ వైపు ఉపాధ్యాయులకు శిక్షణలు, మరో వైపు పరీక్షల నిర్వాహణ, అపార్ మొదలైన పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ బదిలీ చట్టం పారదర్శకంగా రూపొందించాలని, ఉపాధ్యాయులకు నష్టం కలగని రీతిలో సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్, ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్ పీవీ నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్‌లు చందా నరసింహారావు, గుగ్గిలం ఉదయ్‌శంకర్, వంకా ప్రభాకరరావు, కేఏకే జిలానీ, బొంతా వెంకటేశ్వర్లు, నూరుబాషా, సుభాని, సీపీఐ జిల్లా కార్యదర్శి తస్నీరు సింగరకొండ, కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీధర్, జి.నాంచారయ్య, పి.శివాంజనేయులు, శ్రీనువాసరావు, టి.శివయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డైరీ ఆవిష్కరించారు.

చిట్టడవిలా ఎన్నెస్పీ కార్యాలయం



అద్దంకిలోని ఎన్ఎస్పీ కార్యాలయ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న అధికారుల క్వార్టర్లు .. ఏపుగా పెరిగిన చెట్లు .. పడిపోయిన గోడలతో ఉన్న పాత కార్యాలయం

- శిథిలావస్థలో క్వార్టర్స్, పాత కార్యాలయం
- విషసర్పాలకు, మందుబాబులకు అడ్డా
- పట్టించుకోని అధికారులు

అద్దంకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అద్దంకి పట్టణానికి చివరగా ఉన్న ఎన్ఎస్పీ కార్యాలయం ప్రస్తుతం నడిబొడ్డుగా మారింది. పట్టణం విస్తరించడంతో ఎన్నెస్పీ కార్యాలయం పట్టణం మధ్యగా ఉంది. సుమారు 6 దశాబ్దాల కిందట నిర్మించిన క్వార్టర్స్ కార్యాలయం గదులు రెండు దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరాయి. ఒకప్పుడు కార్యాలయం, క్వార్టర్స్‌లో ఉండే అధికారులు, సిబ్బందితో కళకళలాడిన ఎన్ఎస్పీ కార్యాలయం రెండు దశాబ్దాలుగా ప్రాభవం తగ్గుతూ వచ్చింది.

ప్రస్తుతం చిట్టడవిని మించి చెట్లు ఏపుగా పెరిగాయి. విషసర్పాలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. ఎన్నెస్పీ కార్యాలయం ఆవరణలోనే పలు ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయింపు జరిగింది. కోర్టు భవనాల సముదాయం, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, బీసీ సంక్షేమ బాలికల వసతి గృహం, అన్న క్యాంటీన్, అంబేడ్కర్ భవన్, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు కొంత స్థలాలను కేటాయించారు. కొంత భాగంలో ఎన్నెస్పీ కార్యాలయం నూతన భవనం నిర్మాణం చేశారు. అధికారులు, సిబ్బందికి మాత్రం నూతనంగా ఎలాంటి క్వార్టర్స్ నిర్మాణం చేయలేదు. దీంతో సుమారు సగానికిపైగా స్థలంలో చిట్టడవిని తలపించేలా చెట్లు పెరిగాయి. ఎన్నెస్పీ కార్యాలయం ఆవరణ చుట్టూ ఉన్న గృహాల యజమానులు కూడా కొంత మేర స్థలాలను ఆక్రమించినట్లు తెలుస్తోంది. కనీసం ఆవరణను శుభ్రం చేసే విధంగా కూడా అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్ఎస్పీ కార్యాలయ ఆవరణను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టడంతో పాటు సర్వే చేసి హద్దులు నిర్ధారించి, పాత క్వార్టర్స్ కార్యాలయం గదులను తొలగించాలని, కొత్తగా క్వార్టర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ ప్రతినిధులు

5న జొన్నవిత్తులకు పురస్కారం

అద్దంకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వేద కవి, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం 2025ను ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు అద్దంకిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో అందజేయనున్నారు. డీవీఎం సత్యనారాయణ రచించిన వ్యాస మంజూష పుస్తకాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం అద్దంకిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ తెలుగు బాష వ్యాప్తి కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న బహుముఖప్రజ్ఞావంతుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు పురస్కారాన్ని ప్రదానం చేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యూ దేవపాలన, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డీవీఎం సత్యనారాయణ, వారణాసి రఘురామశర్మ, నిమ్మరాజు నాగేశ్వరరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకర్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావంకు రూ.20వేల అందజేత



చెక్కును అందజేస్తున్న రామానంద సరస్వతి

చీరాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో వచ్చే నెల5వ తేదీలన జరగనున్న హైందవ శంఖారాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు భావసారూప్యం కలిగిన ప్రతి ఒక్కరు సహకరించాలని హైందవ శంఖారావం ఇన్‌చార్జి కొర్నెపాటి మహేష్, సహ ఇన్‌చార్జి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఆదివారం వాడరేవు లలితానంద ఆశ్రమ పీఠాధిపతి స్వామి రామానంద సరస్వతిని కలసి సహకారం అడిగారు. అందుకు సానుకూలంగా స్పందించిన రామానంద సరస్వతి వీహెచ్‌పీ ప్రతినిధులకు రూ.20వేల చెక్కును అందజేశారు. హైందవ శంఖారావం కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు సీహెచ్. శ్రీనివాసరావు, జి. ఆంజనేయులు, శేషసాయి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు కె. శంకర్,జి. తులసి, సీహెచ్.అశోక్, రామ్‌మాధవ్ పాల్గొన్నారు.

మలుపు చూడకుంటే ముప్పే



బూదవాడ, పావులూరు మధ్య ఉన్న మలుపు

పంగులూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బూదవాడ నుంచి ఇంకొల్లు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో సాగర్ కాలువ మధ్య రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. చూడకుండా వెళితే ముప్పు తప్పదని ప్రయాణికులు అంటున్నారు. అర్ధ చంద్రాకారాన్ని తలపిస్తున్న ఈ మలుపులో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంగులూరు, పరిసర గ్రామాల నుంచి పావులూరు అభయాంజనేయస్వామి ఆలయానికి రాకపోకలు సాగించే భక్తులతో పాటు ఎరువులు, వ్యవసాయ పరికరాలు, ఇతర వస్తువుల కోసం నిత్యం ఇంకొల్లు పట్టణానికి ప్రజలు కార్లు, ఆటోలతో పాటు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణ సమయంలో మలుపును గుర్తించ లేక వాహనాలు తిరగబడి వ్యక్తులు గాయపడిన సందర్భాలున్నాయి. బూదవాడ, పావులూరు గ్రామాల నడుమ సాగర్ కాలువ డ్రాపుల మధ్య రోడ్డు నిర్మాణం అర్ధచంద్రాకారంగా మలుపు తిరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం కష్టంగా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బూదవాడ, పావులూరు మధ్య రోడ్డు మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని సవరించి రోడ్డు సమాంతరంగా నిర్మించాలని దశాబ్దాలుగా కోరుతున్నా తమగోడు ఎవరూ ఆలకించడం లేదని బూదవాడ, మల్లవరం, కల్లంవారిపాలెం పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. జరుగుతున్న ప్రమాదాలను గుర్తించి తగు నివారణ చర్యలు సత్వరమే చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.

అదుపు తప్పిన ఆటో

ఒకే కుటుంబంలో నలుగురికి గాయాలు

చీరాలటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపు తప్పి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం లక్ష్మీపురం - రామాపురం రోడ్డులో చోటుచేసుకుంది. సరదాగా రామాపురం సముద్రతీరానికి వెళుతున్న క్రమంలో మార్గమధ్యలోని వంతెన సమీపంలో ఆటో అదుపు తప్పింది. దీంతో రోడ్డు వెంబడి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 సహాయంతో చీరాల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



నియమకపత్రాన్ని అందుకుంటున్న షేక్ కాలేషాబాబు

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా షేక్ కాలేషాబాబు

అద్దంకిటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడిగా షేక్ కాలేషాబాబు ఎన్నికయ్యారు. ఆదివారం బాపట్ల జిల్లా కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి వై.స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాలేషాబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణతో పాటు రాష్ట్ర అర్బిజన్ సెల్ కన్వీనర్ బంగారుబాబు, జిల్లా జనరల్ సెక్రటరీ రామకృష్ణ, బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆది శైవ సంఘీయుల అభ్యున్నతికి కృషి

చిత్తూరు ఎంపీ ప్రసాదరావు



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ప్రసాదరావు

చీరాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆది శైవ అర్చక సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని, తమ వంతు సహకారం అందిస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. స్థానిక కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం ఆది శైవ అర్చక సంఘ అధ్యక్షుడు సత్యసీతారామశర్మ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా జరిగిన ఆది శైవ అర్చక సంఘం నూతన పాలకవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఎంపీ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కారంచేటి నగేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రతినిధి స్వర్ణ రవిశంకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ కోసం గాలింపు

అద్దంకి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో శనివారం రాత్రి దూకిన మహిళ కోసం ఆదివారం పోలీస్, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా మృతదేహం జాడ తెలియలేదు. మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన కొల్లూరి హనుమాయమ్మ శనివారం రాత్రి గుండ్లకమ్మ నదిలో దూకినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి పోలీస్, అగ్నిమాపక అధికారుల పర్యవేక్షణలో రిస్క్ టీమ్ గాలింపు చేపట్టారు. సాయంత్రం వరకు గాలింపు చేసినా జాడ కనిపించలేదు. హనుమాయమ్మ కుటుంబసభ్యులు వేరే గజఈతగాళ్ల చేత కూడా గాలింపు చేయిస్తున్నారు.

ఇసుక అక్రమాలను అడ్డుకోవాలి

చీరాల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇసుక అక్రమాలను అడ్డుకోవాలని పలు ప్రజాసంఘాల ప్రతినిధులు ఆదివారం స్థానిక గడియారస్తంభం సెంటర్లో ఆందోళన చేపట్టారు. బోయినవారిపాలెం పరిధిలో ఎక్స్‌వేటర్ దహనంకు సంబంధించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాలు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

వేటపాలెం(చీరాల), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపాయిపాలెం సమీపంలో మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందారు. ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాపాయిపాలెంకు చెందిన పి.వెంకటేశ్వర్లు అలియాస్ బుంగయ్య (55) ఆదివారం ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఓ రియల్టర్ తన వెంచర్లో మెరకల నిమిత్తం ఇసుకను అక్రమంగా తవ్వి తరలించడంతో ఏర్పడిన నీటి గోతిలో పడి బుంగయ్య మృతి చెందాడని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టి కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ప్రమాదంలో గాయపడిన కార్మికుడు మృతి

బల్లికురవ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వీర్ల గంగమ్మ కొండ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గ్రానైట్ కార్మికుడు వివేకానందరెడ్డి (29) ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన వివేకానందరెడ్డి బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో క్రేన్ ఆపరేటర్‌గా ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. క్వారీలో పనిచేసే ముఠా మేస్త్రీ వెంకటేష్‌తో కలిసి బల్లికురవ వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా ఆగి ఉన్న గ్రానైట్ లారీని ఢీకొట్టారు. ఈప్రమాదం లో బైకు నడుపుతున్న తమిళనాడుకు చెందిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన వివేకానందరెడ్డిని వెంటనే తోటి కార్మికులు చిలకలూరిపేట వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ వివేకానందరెడ్డి కూడా మృతి చెందాడు. ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని మతుడు తండ్రి కృష్ణారెడ్డికి అప్పగించారు. అతనికి ఇంకా వివాహం కాలేదు.

హైవేలో డివైడర్‌ను ఢీకొన్న కారు

ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జాయతీ రహదారిలో అత్యవసర రన్‌వేపై కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో కారులోని ముగ్గురు గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో విజయవాడకు చెందిన పోతిని ఫణిసాగర్ కారులో ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తూ రన్‌వైపై రోడ్డు మధ్యన ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో టైరు పగిలి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. కారులో ఐదుగురు ఉండగా, ముగ్గురుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అం బులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కాలేజీల్లోనూ.. మధ్యాహ్న భోజనం

(5వ పేజీ తరువాయి)

వస్తారు. మధ్యాహ్నం భోజనానికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనాన్ని కళాశాలల్లో గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసింది. పైగా పథకం అమలుతో కళాశాలల్లో అడ్మిషన్లు కూడా పెరిగాయి. అయితే జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కళాశాలల్లో ఈ పథకాన్ని నిలిపివేశారు. దీంతో విద్యార్థులు భోజన ఇక్కట్లకు లోనయ్యారు. కొన్ని కళాశాలల్లో అడ్మిషన్లు కూడా కొంత తగ్గినట్లు సమాచారం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మళ్లీ మధ్యా హ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ పథకం అమలుతో మళ్లీ ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరణపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల ఏజెన్సీలకే కళాశాలల బాధ్యత

ప్రస్తుతం పాఠశాలల్లో పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీలకే కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యతలను విద్యాశాఖ అప్పగించింది. కళాశాలకు దగ్గరలో ఉండే పాఠశాల ఏజెన్సీలకు పథకం బాధ్యతలను అప్పగించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియ దాదాపు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కళాశాలల వారీగా వంట ఏజెన్సీలను నియమించినట్లు తెలిపారు. పాఠశాలల్లో అమలు చేస్తోన్న మెనూనే కళాశాలల్లో కూడా అమలు చేయనున్నారు. విద్యార్థులకు రాగిజావ, చిక్కీ అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.


కూటమి.. క్లీన్‌స్వీప్

(5వ పేజీ తరువాయి)

నాయకులతో కలిసి హాజరయ్యారు. ఆ సభ నభూతో నభవిష్యత్తు అన్న రీతిలో భారీ జనసంద్రం మధ్య జరిగింది. అదే సభ వైసీపీ ఓటమికి నాంది పలికింది. ఆ సభ నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యంపై ఈసీ సీరియస్ అయింది. పోలింగ్ సందర్భంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. పల్నాడు జిల్లాకు వచ్చేసరికి రణరంగంగా మారింది. మాచర్ల నియోజకవర్గంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఏకంగా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి ఈవీఎంని ధ్వంసం చేశారు. అది సీసీ టీవీలో స్పష్టంగా రికార్డ్ అయి దేశవ్యాప్తంగా సంచలనమైంది. రెంటచింతలలో టీడీపీ బూత్ ఏజంట్‌గా ఉన్న మంజులరెడ్డిపై వైసీపీ రౌడీమూకలు గొడ్డలితో దాడి చేయగా వెనకడుగు వేయకుండా ధీరోదాత్తాన్ని ప్రదర్శించారు. తెనాలిలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ బూత్‌లో ప్రశ్నించినందుకు ఓటరుపై చేయి చేసుకోగా ఓటరు ఎదురు తిరిగి బుద్ధి చెప్పడం సంచలనమైంది. గురజాలలో కాసు మహేష్‌రెడ్డి పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా ఓటర్లు తరిమి కొట్టారు. పెదకూరపాడులో నంబూరు శంకరరావు, నరసరావుపేటలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కూడా ఓటర్లు పరుగులు పెట్టించారు.

చరిత్రలో నిలిచిపోయిన జూన్ 4న

మే 13న పోలింగ్ జరగ్గా జూన్ 4 వరకు అందరూ ఓటరు తీర్పు కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఓట్ల లెక్కింపు రోజున ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 అసెంబ్లీ నియోజకవర్గాలు, బాపట్ల జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీల్లోనూ మొదటి రౌండ్ లెక్కింపు నుంచే భారీ మెజార్టీలతో కూటమి అభ్యర్థులు దూసుకుపోయారు. నారా లోకేశ్, గల్లా మాధవి నసీర్ అహ్మద్, అరవిందబాబు, బ్రహ్మారెడ్డి, వేగేశన నరేంద్రవర్మ, నాదెండ్ల మనోహర్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, ఏలూరి సాంబశివరావు, కొండయ్య విజయంతో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో వైసీపీ చాలా నియోజకవర్గాల్లో కూకటి వేళ్లతో పెకిలించుకుపోయింది. 100 శాతం గెలుపుని కట్టబెట్టినందుకు చంద్రబాబు తన మంత్రివర్గంలో లోకేశ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికి అవకాశం కల్పించారు. అలానే గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌ని కేంద్ర మంత్రివర్గంలో కూర్చోబెట్టారు.



స్టాప్‌లాక్ గేటు రెండడుగులు పైకి..

- రైతులు ఆందోళన చెందొద్దు..
- ఆయకట్టులో ప్రతి ఎకరాకూ నీరు : ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, డిసెంబరు 29: గత మూడు వారాల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము మరమ్మతులకు గురైంది. ఈ క్రమంలో ఆదివారం స్టాప్‌లాక్ గేటును మెగా ఇంజనీరింగ్ కంపెనీ నిపుణులు రెండు అడుగులు పైకి లేపారు. గేటును పూర్తిగా పైకి లేపి బయటకు తీసి బాగు చేస్తామని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాళ్లపాడు వద్దకు చేరుకుని గేటు పనులను పరిశీలించారు. గేటును పైకి లేపిన ఇంజనీర్లను అభినందించారు. అలాగే మిగిలిన గేట్లకు కూడా త్వరితగతిన బాగు చేయాలని వారికి సూచించారు.

ప్రతి ఎకరాకూ నీరు

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సాగునీటి కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయకట్టు పరిధిలో సాగు చేసిన ప్రతి ఎకరాకూ నీరిస్తామని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా ప్రాజెక్టును సందర్శించి గేటు మరమ్మతులను పరిశీలించారు. ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మితో కూడా ఆయన గేటు పనులపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు, ఏఈ చంద్రమౌళి, టీడీపీ నాయకులు సోంపల్లి మనోహర్, అడపా రంగయ్య, జంపాల శివప్రసాద్, తాళ్లూరి మునలయ్య, గాలంకి ప్రసాద్, బొల్లినేని రమణయ్య, సీహెచ్ బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద గేటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గేటు ఎత్తి నీరు విడుదల

అయితే శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ప్రాజెక్టులోని నీరు 21 అడుగులకు చేరగా, 1000 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నది.దీంతో డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చందంప్రౌళి, సిబ్బంది కొత్త స్పిల్‌వేలోని మూడో గేటును అరడుగు ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేశారు.అయితే ఇన్‌ఫ్లో తగడంతో ఆదివారం తెల్లవారుజాము మళ్లీ గేటును దించి వేశారు. సాయంత్రం 5 గంటల సమయంలో నీటిమట్టం 21 అడుగులకు చేరింది.అయితే ఇన్‌ఫ్లో లేదని అధికారులు తెలిపారు.

3,4 తేదీల్లో ఎస్సీ వర్గీకరణ కమిషన్ పర్యటన : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ జనవరి 3, 4 తేదీలలో జిల్లాలో పర్యటిస్తుందని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరుకు చేరుకుని బస చేస్తారని తెలిపారు. 4వ తేదీ ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశమవుతారని తెలిపారు. అనంతరం రాజీవ్ రంజన్ మిశ్రా వ్యక్తుల నుంచి, సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. తరువాత స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని, ఆరోజు రాత్రి ఇక్కడే బసచేసి 5వ తేదీ ఉదయం ఒంగోలుకు బయలుదేరి వెళతారని తెలిపారు.

పండుతున్న పాపాలు

అందుకలదు.. ఇందులేదన్న.. సందేహము వలదు.. ఎందెందు చూసినా అందందె కనిపించెను అవినీతి.. అన్నట్లుగా తయారయ్యాయి గత ప్రభుత్వంలోని పరిస్థితులు. ఏ పథకంపై విచారణ జరిపినా అందులోని అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఆఖరుకి పేదల ఇళ్ల మాటున నాడు జరిగిన దోపిడీకి అంతూపొంతూ లేదు. లేఅవుట్లకు స్థలాల కొనుగోలు దగ్గర నుంచి వాటిని చదును చేసే వరకూ రూ.వందల కోట్ల ప్రజాధనం స్వాహా జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క లేఅవుట్ల చదును మాటునే ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.50 కోట్లకు పైగా దోపిడీ జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికి చెల్లించిందే ఎక్కువనుకుంటుంటే ఇంకా బిల్లులు చెల్లించాలంటూ కొందరు కోర్టును ఆశ్రయిస్తుండడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించింది. డ్వామా ద్వారా బిల్లుల చెల్లింపు జరిగిన అన్ని లేఅవుట్లను పరిశీలించి వాస్తవికతను నిర్ధారించేందుకు జిల్లాలో కలెక్టర్ ఓ ఆనంద్ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. ఈ విచారణ పూర్తయితే అక్రమాల బాగోతం వెలుగులోకి రానుంది. కాగా ఇప్పటికే అక్రమార్కుల్లో వణుకు పుడుతోంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

- జగనన్న లేఅవుట్లలో దోపిడీపై నేటి నుంచి విచారణ
- ప్రత్యేకంగా నాలుగు బృందాల ఏర్పాటు
- పేదల ఇళ్ల మాటున గత ప్రభుత్వంలో అక్రమాలు
- స్థలం చదును పేరుతో భారీగా నిధుల స్వాహా
- ఇప్పటికే రూ.60 కోట్లు చెల్లింపు
- ఇంకా రూ.33 కోట్లు పెండింగ్



కలువాయి మండలం మాదన్నగారిపల్లెలో వేసిన లేఅవుట్

వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతీ గ్రామంలోనూ భూమిని సేకరించారు. ఆ భూమిని అక్కడి పరిస్థితులకు అనుగుణంగా చదును చేశారు. కొన్ని చోట్ల చదును అవసరం లేకపోయినా తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్నారు. చదును అవసరమైన చోట కూడా చేసిన పనికి, రికార్డు చేసిన బిల్లుకు చాలా వ్యత్యాసం ఉంటోంది. ఇటువంటి అవకతవకలు గతంలోనే వెలుగులోకి వచ్చాయి. అయినా నాడు పట్టించు కోలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు రెండు వేల లేఅవట్లను వేశారు. అందులో ప్రస్తుత జిల్లా పరిధిలో డ్వామా నుంచి 1170 లేఅవుట్లకు రూ.59.85 కోట్లను బిల్లులు కింద ఇప్పటికే చెల్లింపులు చేశారు. ఎంబుక్‌ల ప్రకారం ఇంకా రూ.33 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు చేయించుకున్న వైసీపీ నేతలు ఇప్పుడు కోర్టును ఆశ్రయిస్తున్నారు.

నాలుగు బృందాలతో విచారణ

లేఅవుట్ల చదును పేరుతో జరిగిన అవినీతిని బయటకు తీసేందుకు ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, అందుకు జిల్లాలో నాలుగు విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌తోపాటు ఈసీలు, టీఏలు ఈ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. సోమవారం నుంచీ ఈ బృందాలు విచారణ ప్రారంభించనున్నాయి. విచారణ ఏవిధంగా చేయాలన్నదానిపై ఉన్నతస్థాయి నుంచి విధివిధానాలు కూడా అందాయి. లేఅవుట్లో నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా..? ఎంబుక్‌లో రికార్డు మేరకు అక్కడ పని జరిగిందా..? ఈ గ్రావెల్‌ను అప్రూవల్ క్వారీ నుంచి తీసుకొచ్చారా.. లేక ప్రభుత్వ భూముల నుంచే తీసుకొచ్చారా..? బిల్లులు చెల్లింపు నిబంధనల ప్రకారం జరిగిందా.. లేదా..? విత్‌హెల్డ్ మొత్తం ఎంత ఉంచారు..? ఎంత చెల్లించేశారు..? అన్నది విచారణలో పరిశీలన చేస్తారు. వీలైనంత త్వరగా ఈ విచారణ పూర్తి చేసి నివేదిక అందజేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి విచారణ బృందాలకు ఆదేశాలు అందాయి.

> **నేటి నుంచి విచారణ**
>
> పేదలందరికీ ఇళ్ల పథకంలో జరిగిన లేఅవుట్ల చదునుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లాలో క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ సిబ్బందితో నాలుగు విచారణ బృందాలను ఏర్పాటు చేశాం. సోమవారం నుంచి ఈ బృందాలు విచారణ చేపడతాయి. విచారణ పూర్తయ్యాక ఆ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తాం.
>
> - గంగాభవాని, డ్వామా పీడీ

భారీ దోపిడీ

లేఅవుట్ల చదునుకుగానూ క్యూబిక్ మీటర్ గ్రావెల్‌కు రూ.135 చెల్లించేలా నిర్ణయించారు. అప్రూవల్ క్వారీ నుంచి తీసుకువచ్చిన గ్రావెల్‌కే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా తహసీల్దార్ల అనుమతితో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్‌ను తీసుకెళితే రూ.50 తగ్గించి క్యూబిక్ మీటర్‌కు రూ.85 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో మెజారిటీ లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే గ్రావెల్‌ను తరలించారు. కానీ బిల్లుల దగ్గరికి వచ్చే సరికి రూ.135 చొప్పున చెల్లించారు. అలానే విత్‌హెల్డ్ మొత్తం 25 శాతం ఉంచాలని ప్రభుత్వం ఆదేశిస్తే చాలామందికి 10 శాతం మాత్రమే ఉంచి మిగిలిన 15 శాతం మొత్తాన్ని చెల్లించేశారు. ఇలా ఇప్పటికి సుమారు రూ.60 కోట్ల వరకూ బిల్లులు చెల్లించారు. అయితే క్షేత్రస్థాయి విచారణ జరిపితే ఇప్పటికి చెల్లించిన మొత్తమే చాలా ఎక్కువగా ఉంటుందని డ్వామా వర్గాలు చెబుతున్నాయి.

2024 వెలుగు నీడలు

ఏడాదిలో ముగ్గురు ఎస్పీలు





ప్రథమార్థంలో ఆగని నేరాలు

ద్వితీయార్థంలో కట్టడికి యత్నాలు

- ఎన్నికల్లో చెమటోడ్చిన పోలీసులు
- కూటమి ప్రభుత్వంలో వినూత్న మార్పులు
- నేరాల కట్టడికి విస్తృత ప్రచారం

ఈ ఏడాది ప్రథమార్థంలో జిల్లాలో ఎన్నో నేరాలు,ఘోరాలు జరిగాయి. ద్వితీయార్థంలో వాటి కట్టడికి పోలీసులు వినూత్న ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయినా అనుకున్నంతగా అదుపులోకి రాలేదు. ముఖ్యంగా ఎన్నికల సంవత్సరం కావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఎన్నో పరిణామాలకు దారి తీసింది. గత ప్రభుత్వంలో విధులు నిర్వహించిన పోలీసు అధికారులే ఈ ప్రభుత్వంలోనూ స్టేషన్లు మారి విధులు నిర్వహిస్తున్నారు. దీంతో లాఅండ్‌ఆర్డర్‌లో ఎలాంటి మార్పులేదు. వైసీపీ ప్రభుత్వంలో నాయకులకు అండగా నిలిచిన పోలీసు అధికారులు ఈ ప్రభుత్వంలోనూ అధికార పార్టీ నేతలకు, ప్రతిపక్ష నాయకులకు బ్యాలెన్స్‌గా పనులు చేస్తూ సామాన్యులకు అన్యాయం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నెల్లూరు (క్రైం,ఆంధ్రజ్యోతి)

ఎస్పీల మార్పు

ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ముగ్గురు ఎస్పీలను జిల్లా ప్రజలు చూశారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వంలో ఎస్పీగా ఉన్న తిరుమలేశ్వరరెడ్డి పలు ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆయన్ను జిల్లా నుంచి బదిలీ చేసింది. అనంతరం ఎస్పీగా ఆరీఫ్ హఫీజ్ వచ్చారు. ఆయన ఎన్నికలను సమర్థవంతంగా నిర్వ ర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత జూలైలో ఎస్పీగా జీ కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టారు.



తిరుమలేశ్వర్‌రెడ్డి

ఆరీఫ్ హఫీజ్

కృష్ణకాంత్

నెల్లూరు నగరంలో హెల్మెట్ల వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)



హెల్మెట్ల వాడకంపై అవగాహన

హెల్మెట్ల వాడకం విషయంలో పోలీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో వాటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోకి వచ్చే ప్రతీ పోలీసు అధికారి, సిబ్బంది హెల్మెట్లు ధరించి లోపలికి వచ్చేలా నిబంధనలు తీసుకువచ్చారు. దీనికి తోడు హెల్మెట్ల వాడకంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిం చారు. ప్రతీనెలా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, ఆర్టీవో, రెవెన్యూ, హైవే అధికారులను కలుపుకొని సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను కలెక్టర్ తెలుసుకోవడంతోపాటు అక్కడ ఎందుకు జరిగాయని, ఆ పరిస్థితులు ఏమిటన్న దానిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. హైవేలపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను నెలకోసారి గుర్తిస్తున్నారు. ఆ వివరాలను హైవే అధికారులకు అందించి, అక్కడ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తున్నారు. దీంతో గతంతో పోల్చుకుంటే జిల్లాలో ప్రమాదాల సంఖ్య కాస్త తగ్గింది.

నేరాల కట్టడికి విస్తృత ప్రచారం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నేరాల కట్టడిపై పోలీసు శాఖ విస్తృత ప్రచారం చేస్తోంది. విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో స్థానిక సీఐలు అవగాహన కల్పించడంతోపాటు కరపత్రాలను ముద్రించి అపార్ట్‌మెంట్లతోపాటు ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. సైబర్‌క్రైంలపై కూడా జిల్లా ఎస్పీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించాలంటూ ఆటోల్లో మైక్‌లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు.

మెట్టలోనూ హత్య, చోరీలు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉదయగిరి ప్రాంతాన్ని విషా దంలో నింపిదనే చెప్పుకోవాలి. భార్యను భర్త అతి దారుణంగా కత్తి పొడిచి హత్య చేయడం, గుర్తుతెలియని వ్యక్తుల నివాసాలు, ఆలయాల్లో చోరీలకు పాల్పడడం.. తదితర ఘట నలు చోటుచేసుకొన్నాయి. ఉదయగిరి- కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో ఈనెల 3న భర్త కట్టా మస్తాన్ తన భార్య ఇందిరను హత్య చేసి పరారయ్యాడు. పోలీసులు గాలింపు చేపట్టి మూడు రోజుల తరువాత మస్తాన్‌ను అదుపు లోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. అలాగే వింజమూరు, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని పలు నివాసాలు, ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడి బంగారం, నగదు, వెండి అపహరించుకెళ్లారు. ఆ చోరీలను ఛేదించడంలో పోలీసులు విఫలమయ్యారనే చెప్పుకోవాలి.



హత్యకు గురైన ఇందిర(ఫైల్)

ఖుషీఖుషీగా మందుబాబులు

వైసీపీ హయాంలో నరకం అనుభవించిన మందుబాబులు కూటమి ప్రభుత్వం రావడంతో ఖుషీ అయ్యారు. అక్టోబరు 14న జిల్లావ్యాప్తంగా 182 మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయించారు. దీంతో ప్రైవేట్ వైన్ షాపులు అదేనెల 15 నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఈ దుకాణాల్లో అన్నీ బ్రాండ్లు దొరుకుతుండడంతో మందుబాబులు ఆనందంగా ఉన్నారు. ఇక వైసీపీ ప్రభు త్వం ఎక్సైజ్‌ను రెండు విభాగాలుగా విభజించగా, కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను పాత పద్ధతిలో ఎక్సైజ్‌లో విలీనం చేసింది.

ఎన్నికల్లో శ్రమించిన పోలీసులు

ఎన్నికలకు ముందు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆరీఫ్ హఫీజ్ ఎన్నికల నిర్వహణలో ఎంతో శ్రమించారు. జిల్లాలోని 2470 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరగ్గా, వాటిలో 450 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు రౌడీషీటర్లను, ట్రబుల్ మంగర్స్, గత ఎన్నికల సమయంలో కేసులు ఉన్న సుమారు 10,485 మందిని బైండోవర్ చేశారు. జిల్లావ్యాప్తంగా 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 26క్రైం స్పాట్లు, 26 ఏఎస్‌టీలు, 46 ఎంసీసీ, 105 క్యూఆర్టీ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ. 2,72,31, 845 నగదు, రూ. 2,72,054 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నా రు. 663 కేసులు నమోదు చేసి రూ. 30,56,981 విలువ చేసే 3,999.04 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



హైవేపై ట్రావెల్స్ బస్సును ఢీకొని నుజ్జునుజ్జు అయిన ఐరన్ లారీ

కావలి వద్ద ఘోర ప్రమాదం : ఏడుగురి దుర్మరణం

కావలి, (ఆంధ్రజ్యోతి): గత ఫిబ్రవరి 10 తెల్ల వారుజామున కావలి ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో రెండు లారీలు, ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో ఏడుగురు మృతి చెందగా, 26 మందికి పైగా గాయపడ్డారు. జిల్లాలో ఘోరమైన రోడ్డు ప్రమాదంగా దీన్ని పేర్కొనవచ్చు.

బుచ్చిలో భారీ చోరీ

బుచిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): గత జూన్ 26వతేదీ రాత్రి బుచ్చిలోని గోపాల్ రెడ్డినగర్ పక్కవీధిలో వెంగళరావు అనే ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. రూ. 5లక్షల నగదు, 53 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. జిల్లాలో ఈ ఏడాది జరిగిన చోరీల్లో ఇదే పెద్దదిగా చెప్పుకోవచ్చు.

ఆత్మకూరు అటవీ ప్రాంతంలో పులి సంచారం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈ ఏడాది జూన్ 16న అటవీప్రాంతంలో పులి సంచారం కలకలం రేపింది. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి అటవీప్రాంతం సమీపంలో పెద్దపులి రోడ్డు దాటే క్రమంలో ఒక్కసారిగా కారును ఢీ కొట్టిందని కారు డ్రైవర్ తెలిపారు. బద్వేల్‌కు చెందిన ఐదుగురు కారులో వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. కానీ అది పెద్దపులి కాకపోవచ్చని చిరుతపులి అయిఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావించారు. చివరకు చిరుతపులి సంచరిస్తున్నట్లు నిర్ధారించి ప్రజలను అప్రమత్తం చేశారు.



పులి పాదముద్రలు గుర్తిస్తున్న అటవీ అధికారులు

‘ఉన్నతి’తో ఉద్యోగ, ఉపాధి అవకాశం

- 31 రంగాల్లో 215 కోర్సుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ
- 100 పనిదినాలు పూర్తయిన కుటుంబాల ఎంపిక
- 90 రోజులు వేతన భృతి, సర్టిఫికెట్ల అందజేత
- నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగావకాశాలు

ఉలవపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో భాగంగా జాబ్ కార్డులతో 100రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల నుంచి ఆసక్తి ఉన్న 18ఏళ్ల నుంచి 45ఏళ్లున్న యువతీయువకులకు విద్యార్హతతో పనిలేకుండా సంబంధిత రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారు. 10తరగతి ఉత్తీర్ణులైనా.. ఫెయిల్ అయినా, డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసి ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్న వారికి ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి కూలీపైనే యువత ఆధారపడకుండా నైపుణ్యంపై దృష్టి మళ్లించడమే ఉన్నతికి లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

● 1280 కుటుంబాలు అర్హత...

మండలంలోని 12పంచాయతీల్లో 12వేల జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 10,200 మంది ఉపాధికూలీ పనులు వినియోగించుకుంటున్నారు. గత ఏడాది 100రోజుల పని దినాలు పూర్తయిన కుటుంబాలు 1,280ఉన్నాయి. ఉపాధిహామీ సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు చేపట్టిన సర్వేలో ఇప్పటివరకు నైపుణ్య శిక్షణకు ఆసక్తి చూపించిన యువతీ, యువకులు 542మంది ఉన్నట్లు ఎన్ఆర్ఈజీసీ ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. గుర్తించిన వారంతా శిక్షణకు హాజరైయ్యేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారందిరిని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలులోని రూట్‌సెట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

● 90రోజులు శిక్షణ

ఎంపిక వారికి ఆయా రంగాల్లో 90రోజులపాటు శిక్షణ ఇస్తారు. రోజుకి రూ.300 చొప్పున మూడు నెలలకు రూ.27వేల వేతన భృతి కల్పిస్తూ ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పిస్తారు. శిక్షణా కాలం పూర్తయిన తరువాత ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి ఆయా రంగాలకు చెందిన ప్రవేటు సంస్థల్లో వారందరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

● 31 రంగాల్లో

215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణ...

విద్యార్హతతో పనిలేకుండా ఆధునిక వ్యవసాయంలోని యాంత్రిక, డ్రోన్లు ఆపరేటింగ్, పవర్ స్ప్రేలు వాడకం, వరికోత మిషన్ల ఆపరేటింగ్, మహిళలకు బ్యూటీషియన్, ఆధునిక మగ్గం వర్క్స్, కంప్యూటర్ టైలరింగ్, విజి టబుల్ నర్సరీలు, పట్టు, తేనే, పుట్టగొడుగులు పెంపకం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులు, హార్డ్ వేర్ తదితరల 31 రంగాల్లో 215 కోర్సుల్లో నైపుణ్య శిక్షణలు ఇస్తారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

● ఆంజనేయులనాయక్, వ్యవసాయాధికారి, ఉదయగిరి



ఉదయగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ పేర్కొన్నారు. వ్యాపారస్తుల వద్ద ప్రతి రైతు తాము కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు.

ఇంటర్వ్యూ...

? యూరియా కొరత ఉందా.

! మండలంలో యూరియా కొరత లేదు. సొసైటీలతో ఎరువుల సరఫరా అవుతోంది. రైతుసేవా కేంద్రాలతో ఎమ్మార్పీకే ఎరువులు అమ్ముతున్నారు.

? వర్షాలకు పంట నష్టం జరిగిందా.

! ఫెంగల్ తుపాన్‌తో 46.4 హెక్టార్లలో 94మంది రైతుల పంటలకు నష్టం జరిగింది. వారికి నష్టపరిహారానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

? పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా.

! ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోకుండా ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాపై అవగాహన కల్పిస్తున్నాం. వరి, పెసర, మినుము, శనగ, మామిడి పంటలకు 31వరకు బీమా గడువు ఉంది.

న్యూస్ బాక్స్

టీఐఎస్ గడువు పెంచాలి

అనంతసాగరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల టీఐఎస్ గడువును వచ్చే నెల 31వరకు పెంచాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి ఆదివారం ప్రకటనలో కోరారు. సైట్ పనిచేయక గంటల తరబడి కంప్యూటర్ల ముందు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీల్లో సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దుత్తలూరులో ఆదివారం జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు. నిర్వాహకులు వారికి రూ. 15 వేల నగదు, కప్పు అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోలగట్లలో పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

చేజర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలో ముమ్మరంగా జరుగుతోంది. ఆదివారం నెల్లూరు క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్ళూరు గిరినాయుడు ఆధ్వర్యంలో చేజర్ల మండలానికి చెందిన సోమశిల ప్రాజెక్టు ఛైర్మన్ వేలూరు కేశవచౌదరి కుటుంబ సభ్యులతో పాటు అన్నలూరు శ్రీనివాసులనాయుడు, కొమ్మి తిరుపతినాయుడు, గొర్ల పెంచలయ్య, వడ్లమూడి పెంచలయ్య, గుత్తా వెంకటకృష్ణారావు, షేక్ మస్తాన్, ముళ్ళపూడి హరీష్, స్వర్ణ శాశ్వత సభ్యతం తీసుకున్నారు.

ఎట్టకేలకు తుమ్మలపెంట తారురోడ్డు పనులు

కావలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఐదేళ్లుగా కావలి ప్రజలకు నరకం చూపించిన తుమ్మలపెంట తారురోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కావలి నుంచి తుమ్మలపెంట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. కొనదిన్నె, తుమ్మలపెంట గ్రామాల్లో సీసీ రోడ్డు మిగిలిన ప్రాంతాల్లో తారురోడ్డు నిర్మాణం చేపట్టేలా డిజైన్ రూపొందించారు. పనులు ప్రారంభించేలోపు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ పనులు పాలకులు విస్మరించారు. ఈ రోడ్డులో వెళ్లే వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మే రకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రెండురోజుల్లో పట్టణ హైవేరోడ్డు వరకు పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.



రోడ్డుకు వేసిన తారు మిక్సింగ్‌ను సరిచేస్తున్న కూలీలు

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే ఇంటూరితో వైసీపీ నేత సయ్యద్ మూసా తదితరులు

కందుకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురు వైసీపీ నాయకులు, వారి అనుచర కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. 5వ వార్డు బృందావనంకు చెందిన చనమాల శ్రీధర్ వెంట పలువురు యువకులు, అలాగే 18వ వార్డుకు చెందిన వైసీపీ నేత సయ్యద్ మూసా వెంట 33కుటుంబాల వారు టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సయ్యద్ మూసా గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి పాటు పడుతున్నారని అందుకు ఆకర్షితులమై టీడీపీలో చే రామన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడారు. పాత, కొత్త నాయకులందరికీ సముచితం స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, పులి నాగరాజు, పొడ పాటి నరసింహ్మం, శ్యామ్, నూకతోటి క్రాంతి పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా నున్నా సంతోష్‌కుమార్

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నున్నా సంతో షకుమార్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆత్మకూ రులో బీజేపీ సీనియర్ నాయకుడు బత్తల కృష్ణయ్య ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా సంతోష కుమార్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో బీజేపీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధా కర్, నలిశెట్టి జగదీష్‌లు సంతోష్‌కుమార్‌ను అభినందించారు.



నున్నా సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న నేతలు

బీజేపీ మండలాధ్యక్షుడిగా ముడి కిషోర్‌రెడ్డి

● జలదంకి: బీజేపీ మండలాధ్యక్షుడిగా ముడి కిషోర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో ఆదివారం పార్టీ జిల్లా ఎన్నికల సహ కన్వీనర్ అంచపాకల కమల, మండల ఎన్నికల పర్యవేక్షకుడు పాలగొల్లు నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. జలదంకి చెందిన ముడి కిషోర్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడికి పార్టీ సీనియర్ నాయకులు బ్రహ్మారెడ్డి, తిరుపతిరెడ్డి, హనుమారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మధు, రాకేష్‌రెడ్డి, రంగయ్యలు అభినందనలు తెలిపారు. అలాగే మండల ప్రముఖ్‌గా రామాల క్రిష్ణారెడ్డి ఎంపికయ్యారు.



జలదంకి: ముడి కిషోర్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

బీటీఏ నేతకు నివాళి



నివాళులర్పిస్తున్న బీటీఏ నాయకులు

కందుకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు దార్ల నరసింహ అకాల మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి రమేష్ వాపోయారు. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొని నివాళులర్పించారు. అంబేడ్కర్ వాది, బుద్దిస్ట్ అయిన దార్ల నరసింహ అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళ్లగుంట మోహనరావు, పర్రె వెంకటరావు, పల్లం వేణుగోపాల్, ఆదినారాయణ, మాల్యాద్రి, కావలి ఎంఈఓ బండి గోవిందయ్య, వివిధసంఘాల నాయకులు పల్నాటి శ్రీరాములు, మల్లికార్జునరావు, మాధవరావు, గాండ్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బిట్రగుంట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేటలో ఆదివారం అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ వ్యవస్థాపకురాలు జీవీ శైలజ ఆధ్వర్యంలో సభ్యులు గ్రహణం, మొర్రి బాధితులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిన్నమ నేని సిద్ధార్థ మాట్లాడారు. విజయవాడ గన్నవరంకు చెందిన పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ వారితో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు గ్రామాలకు చెందిన 20మందికి వైద్య పరీక్షలు చేసి వారిలో 5మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మిగిలిన వారికి ఉచిత మందులు అందజేశారు. జనవరి 11 నుంచి 20వరకు టెస్టులు నిర్వహించి తదుపరి ఆపరేషన్లు చేస్తామన్నారు. పేషట్లకు ప్రయాణ ఖర్చులు, భోజన వసతులు సంస్థ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు గండూరి మంజుల, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, జయరామయ్య ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సేవాసమితి బాధ్యులు

కావలి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కమ్మవారి సేవాసమితి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం సాయంత్రం వెంగళరావునగర్‌లోని సేవాసమితి కార్యాలయంలో సమితి బాధ్యులు ఆవిష్కరించారు. జనవరి 5న పెద్దపవని రోడ్డు పీజీ సెంటర్ సమీపంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో సమితి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు మాకినేని మాల్యాద్రి, కూరపాటి రమేష్, బాధ్యులు విశ్వశాంతి రమణయ్య, శ్రీనివాసులు నాయుడు, బోట్లగుంట శ్రీహరి నాయుడు, వేలూరి జయచంద్రనాయుడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంగమేశ్వరుడికి లక్ష బిల్వార్చన

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరస్వామికి మార్గశిర బహుళ చతుర్దశి సందర్భంగా ఆదివారం లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో ని ర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఉదయం గణపతి పూజ, స్వస్తివాచకము, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు లక్ష మారేడు ఆకులను గంపలు, తట్టలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం 8గంటల నుంచి లక్ష బిల్వార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

పాకెట్ మనీతో చిన్నారుల దుప్పట్లు పంపిణీ

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగం గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులు దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాల మేరకు.. ఓ పాఠశాలలో చదివే హిమ రవిశంకర్, నిఖిల్, రిషి, మహిధర్‌లు స్నేహితులు.ఉపాధ్యాయుల సూచనలతో తాము ఏదో ఒక మంచి పనిచేయాలని తలచారు. దీంతో పాఠశాలకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు వారికి ఖర్చుల కోసం ఇచ్చిన నగదును పొదుపుచేసి 50దుప్పట్లు కొనుగోలు చేశారు. వాటిని చలితో ఇబ్బందులు పడుతున్న చల్లా యానాదులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఆదివారం అందచేశారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం నేతలు సురేంద్ర రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సంగం : గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

● కావలి టౌన్: పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఆదివారం బ్రాహ్మణ మహా సంఘం సభ్యులు యాచకులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు పీవీఎస్ ప్రసాద్ అధ్యక్షత జరిగిన కార్యక్ర మంలో కళాధర్‌రావు, వెంకటేశ్వర్లు, గంగు చంద్రశేఖర్, వెంకట సుబ్రమణ్యం, రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ మహాసంఘం నేతలు

● లింగసముద్రం: మండల ఎస్ఐ షేక్ మహబూబ్ సుభానీ, సర్పంచు పులి రాఘవులు స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రామకృష తదితరులు ఉన్నారు.

యువకుడిని రక్షించిన మెరైన్ కానిస్టేబుల్

కావలి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట సముద్ర స్నానానికి వెళ్లి అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతున్న సర్వాయపాలెం వడినాల సురేష్‌ను ఆదివారం సాయంత్రం మెరైన్ కానిస్టేబుల్ గోవిందరాజు కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఈయన గ్రామానికి చెందిన మరో ఇద్దరు రొయ్యల గుంటల వద్ద రోజువారి కూలీలు. ఆదివారం సెలవుదినం కావడంతో స్నేహితులతో వచ్చి స్నానం చేస్తుండగా ఈ ఘటన జరిగింది. విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి సముద్రంలో కొట్టుకుపోతున్న సురేష్‌ను కాపాడిన కానిస్టేబుల్ గోవిందరాజును సీఐ దాసరి ప్రసాద్, ఎస్ఐ కిషోర్‌బాబు అభినందించారు.

పంచాయతీ అభివృద్ధికి చర్యలు

ఉదయగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాలక మండలి, ప్రజల సహకా రంతో పంచాయతీ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు సర్పంచ్ గొల్లపల్లి కల్పన పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గంతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీలో ఏర్పాటు చేయాల్సిన రహదారులు, డ్రైన్ల నిర్మాణంపై చర్చించారు. వీధిదీపాల ఏర్పాటుతోపాటు పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, కార్యదర్శి నాగూర్‌బీ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీల్లో వైసీపీ రద్దు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించడం విద్యార్థులకు వరం అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరు ప్రభుత్వ జూని యర్ కాలేజి ప్రిన్సిపాల్ వాణీ శ్రీ, అధ్యకులు ఆదివారం నెల్లూరులో ఆనం రామనారాయణరెడ్డిని కలిసి జనవరి 3న మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.



మంత్రిని ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ వాణీశ్రీ

డ్రైనేజీలు మరిచారు..



కొండబిట్రగుంట- ముంగమూరు ఆర్ అండ్‌బీ రోడ్డు కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. దీనికితోడు మండలకేంద్రంలోని ఇళ్లలోని నీరు రోడ్డుపైకి వచ్చి నిలుస్తుంది. రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో అధికారులు మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. రెండునెలలో కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలు జరుగనున్నా గ్రామంలోని ఆర్అండ్‌బీ రోడ్డు విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

రాళ్లపాడులో టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

లింగసముద్రం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెంట్రాల పంచాయతీ రాళ్లపాడు గ్రామంలో ఓ వివాదాస్పద స్థలం విషయం.. పాత కక్షల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం ఆ స్థలంలో ఓ పార్టీకి చెందిన వారు దున్నారు. అయితే ఈ విషయమై రాత్రి 8 గంటల సమయంలో గ్రామానికి చెందిన మరో పార్టీ వారు వచ్చి.. ఈ స్థలంలో ఎందుకు దున్నారని వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం నెలకొంది. మాటమాట పెరిగి రెండు పార్టీల వారు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ దాడిలో ఇరువ ర్గాలకు చెందిన వారికి తలలకు, కాళ్ల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్ మహబూబ్ సుభానీ హుటాహుటిన రాళ్లపాడు వెళ్లి పరిస్థితిని సమీక్షించి, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

టిప్పర్ల రాకపోకలతో రోడ్డు అధ్వానం



కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు-పామూరు రోడ్డు నుంచి వెంకటా ద్రిపాలెంకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. 167బీ హైవే నిర్మాణానికి కాంట్రాక్టరు భూములు కొనుగోలు చేసి అక్కడి నుంచి భారీ టిప్పర్లతో గ్రావెల్ తరలించడంతో ఈ దుస్థితి నెలకొంది.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే..

ఉదయగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్లు భారం మోపారన్నారు. వారే విద్యుత్ చార్జీలు పెంచి వారే ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ రియాజ్, అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉదయగిరిలో శ్వేతపత్రాలు ప్రదర్శిస్తున్న టీడీపీ నాయకులు

అలరించిన సంక్రాంతి పోటీలు



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సౌజన్యంతో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి పోటీలు అలరించాయి. పట్టణంలోని అలఘనాథస్వామి ఆలయం సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులు, కోలాటం, సంక్రాంతి లక్ష్మీ, కర్రసాము, కుస్తీ తదితర పోటీలు కొనసాగాయి. పాఠశాలల విద్యార్థులకు శాస్త్రీయ సంగీత, నృత్య పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. అనంతరం సోమవరపు సుబ్బరాయుడు అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటుచేసి కంచి పరమేశ్వరరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ గంగాధర్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చంద్రా వెంకటసుబ్బానాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, తెలుగు భారతి సేవా సమితి నేతలు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలినడక మార్గం



స్థానిక చెరువు కట్ట రెండవ తూము వద్ద కాలినడకన పొలాల్లోకి కట్టపై నుంచి కిందకు దిగే మార్గం ప్రమాదభరితంగా మారింది. మెట్లకు పూతపనులు చేయక రాళ్లు తేలి జారుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతులు వ్యవసాయ సామాగ్రితో పాటు, ఎరువులు కిందకు తీసుకెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. ఇరిగేషన్ అధికారులు చొరవ చూపి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)